

అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34 (శనివారం)
కనిష్ఠం : 28

నృత్య ప్రదర్శనలో రికార్డు

అభినందించిన ఎమ్మెల్యే ఆనందరావు



కార్యాలయంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్వో రాజకుమారి

కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర

అమలాపురం టౌన్, మే17(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత.. పచ్చదనం.. పరిశుభ్రత.. జీవన శైలిలో ఓ భాగంగా అలవరచుకోవాలని డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి సూచించారు. శనివారం అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగంగా ఆమె సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలు, పాఠశాలల్లో నీటి సంరక్షణా నిర్మాణాలను చేపట్టాలని డీఆర్వో కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, సిబ్బంది నాగేంద్ర, నాగసుశీల, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో ట్రాఫిక్ పోలీసులకు పరికరాలు అందిస్తున్న ఎస్పీ, ఓఎన్జీసీ అధికారులు

మితిమీరిన వేగం వద్దు : ఎస్పీ కృష్ణారావు


అమలాపురం, మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు చర్యలు తీసుకోవాలని ఎస్పీ బి.కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. అమలాపురం క్షత్రియ కల్యాణ మండపంలో శనివారం రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. స్నేహిత స్వచ్ఛంద సేవా సంస్థ, ఓఎన్జీసీ సంయుక్త సహకారంతో ట్రాఫిక్ పోలీసులకు వివిధ పరికరాలను అందజేశారు. పట్టణ సీఐ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.





అమలాపురంలో నృత్య ప్రదర్శన ఇస్తున్న గంధం అక్కాచెల్లెలు.. వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

అమలాపురం,మే17(ఆంధ్రజ్యోతి): అక్కాచెల్లెలు అయిన ఆ చిన్నారులిద్దరూ ఆహూతుల సమక్షంలో రెండు గంటలపాటు ఏకధాటిగా వివిధ నృత్య ప్రదర్శనలతో పలు రికార్డులను సొంతం చేసుకున్నారు. అమలాపురం పట్టణానికి చెందిన గంధం ఆదినారాయణ-దేవి దంపతుల కుమార్తెలు తనుశ్రీ, బ్రహ్మణిలు శనివారం స్థానిక ఏ1 కన్వెన్షన్ హాలులో నృత్య ప్రదర్శన నిర్వహించారు. కూచిపూడి భరతనాట్యం, పేరణి, తెలుగు జానపదం (ఫోక్), రాజస్థాన్ జానపద నృత్యం వంటి ఐదు రకాల నృత్య ప్రదర్శనలు రెండు గంటలు దాటి ప్రదర్శన నిర్వహించడం ద్వారా పది ప్రపంచ రికార్డులను సొంతం చేసుకున్నారు. ప్రముఖ నాట్య గురువు, సత్యభామ అవార్డు గ్రహీత సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శనకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌతిండియా కోఆర్డినేటర్ డాక్టర్ జ్యోతిరంగ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా గంధం సిస్టర్స్‌ను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ తదితరులు అభినందించారు.



బాబు సూపర్ 6 తీపి కబురు

పథకం	అర్హులు	నగదు (కోట్లు)
తల్లికి వందనం	16.51 లక్షలు	2,476
ఉచిత బస్	25.52 లక్షలు	--
గ్యాస్ సిలిండర్	13 లక్షలు	--

3 పథకాల అమలుకు గ్రీన్‌సిగ్నల్

- మహిళలకు తీన్‌మార్
- ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు
- 25.50 లక్షల మందికి ప్రయోజనం
- బడులు తెరిచేలోగా తల్లికి వందనం
- ఇప్పటికే విద్యార్థుల జాబితా సిద్ధం
- 16.51 లక్షల తల్లులకు డబ్బులు
- మూడు సిలిండర్లకు ఒకేసారి నగదు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. సూపర్ సిక్స్ హామీల అమలుపై స్పష్టత ఇచ్చింది..అతివలంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న ఉచిత బస్సు ప్రయాణానికి ముహూర్తం ఖరారు చేసింది. ఆగస్టు 15 నుంచి పథకం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు శనివారం కర్నూలులో అధికారికంగా ప్రకటించారు. పాఠశాలలు తెరిచేసరికి తల్లికి వందనం పథకం కింద మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తుంది.ఇంట్లో ఎందరు పిల్లలు ఉంటే వారం దరికి ప్రభుత్వం నగదు జమ చేయ నుంది. మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీకి సంబం ధించి ప్రస్తుతం ఒక్కో సిలిండర్‌కే నగదు జమ చేస్తుండగా.. ఇకపై ఒకేసారి మూడు సిలిండర్ల నగదు ఒకేసారి మహిళల ఖాతాల్లో జమచేయబో తున్నట్టు ఇటీవల చంద్రబాబు ప్రకటించారు. ఇలా ఎన్నికల ముందు టీడీపీ ప్రకటించిన మూడు సూపర్ సిక్స్ హామీల అమలుకు చకచకా అడుగులు వేస్తుండడంతో మహిళలకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరబోతోంది.



ఆగస్టు 15 నుంచి ఉచిత బస్..

సూపర్‌సిక్స్ హామీల అమలుకు సీఎం చంద్రబాబు చకచకా అడుగులు వేస్తున్నారు. ప్రధానంగా మహిళలకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చే పథకాలను నెరవేర్చడానికి కసరత్తు తీవ్రం చేశారు.తాజాగా శనివారం కర్నూలు పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించారు. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 25.52 లక్షల మందికిపైగా మహిళలకు లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగానా.. లేదా విభజిత జిల్లాల ప్రాతిపదికన ఉచిత బస్సు పథకం అమలు చేస్తారా అనే దానిపై త్వరలో స్పష్టత రానుంది. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా ఆర్టీసీ చార్జీలను పెంచేసి పేదల నడ్డివిరగ్గొట్టింది. కొద్దిపాటి దూరానికే షాక్‌కొట్టే చార్జీలు వసూలు చేసింది. దీంతో టీడీపీ ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రకటించింది. కూటమిని గెలిపిస్తే ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చింది.పథకం అమలు ప్రకటించడంతో మహిళల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గ్యాస్ డబ్బులూ ఒకేసారి..

మహిళలకు ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తామన్న హామీ మేరకు ఇప్పటికే ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారు.మహిళలు సిలిండర్ బుక్ చేసుకున్న తర్వాత కొద్దిరోజులకే ఆ డబ్బులను బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 13 లక్షల వరకు గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి.తొలి ఉచిత సిలిండర్ కింద ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 11.52 లక్షల మంది ఈ సదుపాయం వినియోగించుకోగా రూ.95 కోట్లు బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. రెండో ఉచిత సిలిండర్ ఇప్పటికే 6.70 లక్షల మంది తీసుకున్నారు.డబ్బులు ఖాతాల్లో జమవుతున్నాయి.ఇకపై విడివిడిగా కాకుండా మూడు సిలిండర్లు బుక్ చేసుకున్నా చేసుకోకపోయినా ముందే నగదు ప్రభుత్వం ఖాతాల్లో జమచేయబోతోంది.



తల్లికి..రాబడి..

తల్లికి వందనం పథకం అమలుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. వచ్చే నెలలో స్కూళ్ల తెరిచేలోగా తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తామని తాజాగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో లక్షల మంది పేద, మధ్య తరగతి తల్లుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తల్లికి వందనం కింద ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు పిల్లలను బడులకు పంపే తల్లులకు ఏటా రూ.15 వేల చొప్పున ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ఎన్నికల హామీల్లో భాగంగా ప్రకటించారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని బడులు తెరిచేలోపు అమలు చేస్తామని ప్రకటించారు. వాస్తవానికి గత ప్రభుత్వం అమ్మ ఒడి పేరుతో బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేలు ఇస్తామని ప్రకటించి మోసగించింది. సీఎం చంద్రబాబు ఇటీవల బడ్జెట్‌లో పథకానికి ప్రాధాన్యత కల్పించారు. వచ్చే నెలలోగా జమ కానున్న తల్లికి వందనం డబ్బులు ఉమ్మడి తూర్పుగోదావరిలో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 16.51 లక్షల మంది పిల్లలకు సంబంధించి వారి తల్లులకు ఆర్థిక ప్రయోజనం కలగనుంది. ఒక్కో విద్యార్థికి ఏటా రూ.15 వేల చొప్పున ఉమ్మడి జిల్లాకే ఏకంగా రూ.2,476 కోట్ల వరకు నిధుల అవసరం. కాకినాడ జిల్లా చూసుకుంటే 6.20 లక్షల మంది పిల్లల తల్లులకు ప్రయోజనం కలగనుంది.

రహదారుణాలు!

వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురి మృతి




తునిలో ముగ్గురిని బలి తీసుకున్న ప్రమాదం

7 | మెయిన్ పేజీల్లో

అతివేగం ప్రాణాలు తీస్తోంది.. ఎదురొచ్చే ప్రమాదాన్ని అంచనా వేయలేక పలువురు ప్రాణాలనే పోగొట్టుకుంటున్నారు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం రహదారులు రక్తసిక్తమయ్యాయి.. వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు మృతిచెందారు. కాకినాడ జిల్లా తుని రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఐరన్ లోడ్ లారీని విశాఖ నుంచి వేగంగా వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.. తెలంగాణ రాష్ట్ర రంగారెడ్డి జిల్లాకు చెందిన మరో కుటుంబం దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా కోనసీమ జిల్లా అంబాజీ మండలం ముక్కామల వద్ద జరిగిన ప్రమాదంలో వివాహిత మృతి చెందగా నలుగురు గాయాలపాలయ్యారు. కాలినడకన శృంగార వల్లభస్వామి ఆలయానికి వెళుతున్న మహిళను పిఠాపురంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ముమ్మిడివరం వద్ద మోటార్‌సైకిల్‌ను లారీని ఢీకొన్న ఘటనలో ఒకరు.. ఎండగా ఉందని లారీ కింద సేదతీరుతుంటే డ్రైవర్ గమనించకుండా పోనివ్వడంతో మరొకరు మృతిచెందారు.



మాజీ మంత్రి రాజా



విలేకరి కాతా

దాడి పాపం.. పండినట్టే!

అన్ని రోజులూ ఒకేలా ఉండవు.. కాలం ప్రతి ఒక్కరి లెక్క సరిచేస్తుంది.. ఇది అక్షర సత్యం.. ఒకనాడు ఆయన మంత్రి.. ఏం చేసినా అడిగే నాథుడు లేడు.. చివరికి ఆంధ్రజ్యోతి విలేకరిని అతనే చంపించాడని ఆరోపణలున్నా కేసే లేదు.. దర్జాగా తిరుగుతున్నాడు.. కాలం మారింది.. కాలంతోపాటే ప్రభుత్వమూ మారింది.. ముగిసిపోయిందనుకున్న కేసును తిరిగి తెరిచారు.. పాపం లెక్క సరిచేయడానికి చూస్తున్నారు.. అతనెవరో తెలుసా..మాజీ మంత్రి దాడిశెట్టి రాజా.. ఇన్నాళ్లకు అతని పాపం పండిందని అనుకుంటున్నారు. - 7లో









చెత్తకు నిప్పుపెడితే

చర్యలు తప్పవు

డీపీవో శాంతలక్ష్మి

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

మండపేట, మే 17 (ఆంధ్రజ్యోతి) గ్రామాల్లో పంచాయతీల ద్వారా సేకరించే చెత్తను ఎరువుగా మార్చాలేతప్ప చెత్తకు నిప్పుపెడితే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారిణి శాంతలక్ష్మి కార్యదర్శులను హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో శనివారం 'చెత్తకు చోటేది..' శీర్షిక వచ్చిన కథనంపై ఆమె స్పందించారు. జిల్లాలో ఉన్న పంచాయతీల్లో వచ్చే చెత్తను సంపద కేంద్రాలకు తరలించి సేంద్రియ ఎరువుగా మార్చాలేతప్ప చెత్తకు నిప్పుపెట్టి పర్యావరణానికి విఘాతం కలిగించి కాలుష్యానికి కారణమయ్యే సిబ్బందిపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కాగా మండపేట మండలంలో తాపేశ్వరం, వెలగతోడు, అర్తమూరు గ్రామాల్లో చెత్తకు నిప్పుపెట్టడం, అనపర్తి- అర్తమూరు రోడ్డులో డ్రైన్ చెంతనే చెత్తకుప్ప పేరుకుపోవడంపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. చెత్తకు నిప్పుపెట్టవద్దని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

జిల్లాలో కేంద్ర సీనియర్ ఐఏఎస్‌ల బృందం పర్యటన

మూడు రోజులపాటు గ్రామాల సందర్శన

మండపేట, మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 21, 22, 23 తేదీల్లో మూడురోజులపాటు, సీనియర్ ఐఏఎస్ అధికారుల బృందం పర్యటించనుంది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ బృందం పర్యటించే గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీల్లో ఎంపిక చేసిన ప్రాంతాల అధికారులకు సర్క్యులర్‌ను జారీచేశారు. స్వర్ణాంధ్ర సంకల్పం కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన సీనియర్ ఐఏఎస్‌ల బృంధం సభ్యులు ఎంపిక చేసిన గ్రామాల్లో మూడు రోజులపాటు బస చేసి ఆయా గ్రామాల్లో పర్యటిస్తారు. ఈనెల 21, 22 రెండురోజులపాటు క్షేత్ర స్థాయిలో పర్యటించి గ్రామాల్లో అభివృద్ధి, ప్రజల స్థితిగతులపై అధ్యయనం చేయనున్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాల ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా అంశాలతో పాటు వారు నివసించే ప్రాంతాల్లో మౌలిక వసతులు వంటివి ఎలా ఉన్నాయో కూడా బృందం పరిశీలించనుంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు ఎంపిక చేసిన గ్రామాల్లో మండల స్థాయి, డివిజన్ స్థాయి అధికారులు కేంద్ర బృందం వచ్చేనాటికి తీసుకోవాల్సిన అంశాలపై కసరత్తు చేస్తున్నారు. ఇక ఈ బృందం పర్యటించే ప్రాంతాలు.. ముమ్మిడివరం నగర పంచాయతీలో మూడో వార్డు, అమలాపురం మున్సిపాల్టీలో ఒకటో వార్డు, అమలపురం రూరల్ బడుగువారిపేట, కాట్రేనికోన మండలం చెంచులగరువు, సఖినేటిపల్లి మండలం ఉయ్యూరివారిమెరక, ఐ.పోలవరం మండలం కేశనకుర్రు, మలికిపురం మండలం మలికిపురం, మామిడికుదురు మండలం మామిడికుదురు, రాజోలు మండలం రాజోలు, ఉప్పలగుప్తం మండలం ఉప్పలగుప్తం, అలమూరు మండలం చొప్పెల్ల, రావులపాలెం మండలం రావులపాలెం, కొత్తపేట మండలం కొత్తపేట, ఆత్రేయపురం మండలం వసంతవాడ, పి.గన్నవరం మండలం పి.గన్నవరం, మండపేట మున్సిపాల్టీ ఒకటో వార్డు, మండపేట మండలం ద్వారపూడి పంచాయతీ, కె.గంగవరం మండలం కె.గంగవరం, కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురం, రాయవరం మండలం రాయవరం, గ్రామాల్లో ఎంపికచేసిన ట్రైబల్ ఏరియాల్లో అధికారుల బృందం పర్యటించనుంది. గ్రామాల్లో శానిటేషన్, తాగునీరు వంటి అంశాలతోపాటు మౌలిక సదుపాయాలపైనా మండలస్థాయి అధికారులు సమీక్షలు చేసుకుని కేంద్ర బృందం వచ్చేసరికి చేపట్టాల్సిన వాటిపై సమీక్షించుకుంటున్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం!

మ్యూజియంలు 6



నిర్లక్ష్యం

» గత వైభవానికి చిహ్నాలు » నేడు ఎవరికీ పట్టని కట్టడాలు
» పాలకుల అశ్రద్ధ » కనుమరుగైపోతున్న చారిత్రక అపురూపాలు

ప్రదర్శనశాలలు!

నేడు అంతర్జాతీయ మ్యూజియం డే

రాజమహేంద్రవరం అంటే గోదావరి గట్టు, పార్కులు మాత్రమే కాదు.. అలనాటి వైభవాన్ని కళ్ల ముందుంచే మ్యూజియాలు కూడా ఉన్నాయి. సంస్కృతిని.. గత వైభవాన్ని భావి తరాలకు అందించే ఆలయాలు ఈ ప్రదర్శనశాలలు (మ్యూజియాలు). రాజమహేంద్రవరం వెయ్యేళ్ల చరిత్రకు మౌనసాక్షి. ఈ కాలగమనంలో ఎందరో మహానుభావులు ఇక్కడ కదలాడారు. ఎన్నో సజీవ అవశేషాలను ఆనాటి చరిత్రకు రుజువులుగా చరిత్ర మిగిల్చింది. వాటిని చూడడం వల్ల గత కీర్తిని పరికించవచ్చు. అవశేషాలను తాకడంతోనే చరిత్రను స్పృశించినట్టు ఉంటుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న ప్రదర్శనశాలలు అధ్వానంగా మారిపోవడం చూస్తే 'అంతర్జాతీయ మ్యూజియం డే' సాక్షిగా ఆవేదన కలిగిస్తోంది. కనీసం కరెంటు బిల్లుకూ తిఖానా లేని దుస్థితిని చూసి చరిత్ర కన్నీరు పెడుతోంది. ఆనాటి మహానుభావులు మనకు అందించిన వారసత్వ సంపదను ఇప్పుడు మనం కాపాడుకోలేకపోతున్నాం. రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఇక్కడి వారే. ఇప్పుడైనా మ్యూజియాల దుస్థితి దూరమవుతుందేమో కాలమే చెప్పాలి. నేడు అంతర్జాతీయ మ్యూజియం డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.

రాజమహేంద్రవరం ఘనతనే కాకుండా ఆంధ్రదేశ కీర్తిని కళ్ల ముందు కదలాడించే సజీవ అవశేషాలు, చిత్రలేఖనాలు వంటి వాటితో ప్రదర్శనశాలలు ఇక్కడ ఉన్నాయి. తాళపత్రాలు, తామ్రశాసనాలతోసహా ఎంతో అపురూప పురావస్తు సంపద ఉన్న రాళ్లబండి సుబ్బారావు ప్రదర్శనశాల, యుగ పురుషుడు కందుకూరి వీరేశలింగం జన్మ గృహం, దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ, మరుగున పడిపోతున్న ఎన్నో సాహిత్య ప్రక్రియలను భావితరాలకు అందించాలని తపించిన జానపద వాఙ్మయ బ్రహ్మ నేదునూరి గంగాధరం జానపద స్మారక గ్రంథాలయం, ధవళేశ్వరం బ్యారేజీ నిర్మాణాన్ని కళ్లకట్టే కాటన్ మ్యూజియం.. అన్నీ దీనావస్థలోనే ఉన్నాయి. సాధ్యమైనంత వరకూ డిజిటలైజేషన్ చేయాలనే ఆలోచన చేయకపోవడంతో ఎన్నో అపురూపాలు భావితరాలకు అందకుండాపోయే ప్రమాదం కనబడుతోంది. - రాజమహేంద్రవరం/ఆంధ్రజ్యోతి






రాజమహేంద్రవరంలోని దామెర్ల ఆర్ట్ గ్యాలరీ.. దామెర్ల, దామెర్ల చిత్రాలు

దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ



గోకవరం బస్టాండు ఎదుటి వీధిలో రెండు పెద్ద భవనాల్లో దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ ఉంది. ఇది సాంకేతిక విద్యా శాఖ ఆధీనంలో నడుస్తోంది. ఐదేళ్ల నుంచీ కరెంటు బిల్లు కూడా చెల్లించలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. రామారావు స్వయంగా వేసిన చిత్రాలతోపాటు ఎన్నో అపురూపమైన చిత్రాలు చరిత్రలో కలిసిపోడానికి సిద్ధంగా ఉన్నాయి. దామెర్ల రామారావు 1897 మార్చి 8న రాజమహేంద్రవరంలో జన్మించారు. చదువుకంటే చిత్రలేఖనంపైనే ఎక్కువగా ఆసక్తి ఉండడం గమనించిన ఆయన మేనమామ రామారావుకు పదేళ్ల ప్రాయంలోనే వాటర్ కలర్స్‌ని కొనిచ్చారు. రామారావు తన సొంత భావాలను కుంచె నుంచి జాలువార్చి అపురూప కళాఖండాలను చిత్రించారు. ఆయనకు 15 ఏళ్లప్పుడు కళాశాల ప్రిన్సిపాల్ ఓజే కూల్డ్రే ప్రతిభను గుర్తించి సహకరించగా తండ్రి వెంకట రమణారావు కొడుకును 1916లో ముంబైలోని జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ కళాశాలకు పంపించారు. ఆయన వేసిన చిత్రాలు 1922లో విదేశాల్లో ప్రదర్శించారు. అక్కడికి తీసుకెళ్లిన చాలా కళాఖండాలు తిరిగి రాలేదని చెబుతారు. రామారావు చిత్రకళతో ఎంతో ఖ్యాతిని సముపార్జించడంతోపాటు రాజమహేంద్రవరానికి కూడా చిత్రలేఖనంలో ఘనత సాధించిపెట్టారు. ఆయను సముచిత గౌరవం ఇస్తూ దామెర్ల రామారావు ఆర్ట్స్ గ్యాలరీని 1954 జూన్ 23న అప్పటి కేంద్ర సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రారంభించారు. అనంతరం మరో భవనానికి 1996 మార్చి 17న అప్పటి రాజమండ్రి ఎంపీ కేవీఆర్ చౌదరి శంకుస్థాపన చేశారు.

నేదునూరి జానపద స్మారక గ్రంథాలయం



నేదునూరి దంపతులు







రాజమహేంద్రవరంలోని నేదునూరి గంగాధరం జానపద వాఙ్మయ గ్రంథాలయం.. గ్రంథాలయంలో జానపద సాహిత్య పుస్తకాలు

జనపదాలే జానపదాలు. వాటిని పోగు చేయడమంటే మాటలు కాదు. ఎంతో వ్యయప్రయాసలు తప్పవు. అంతటి కష్టాలకోర్చి సేకరించిన జానపద సాహిత్యంతో దేశంలో రెండు గ్రంథాలయాలు మాత్రమే ఉన్నాయి. ఒకటి పంజాబులో దేవేంద్ర ప్రత్యర్థిది కాగా.. రెండోది మన నేదునూరి జానపద స్మారక గ్రంథాలయం. దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ పక్కనే ఉంది. జన పదాలకు సంబంధించిన ఎన్నో సాహిత్య ప్రక్రియలను ఇక్కడ మనం చూడవచ్చు. చెక్క భజనలు, జానపద కథలు, గేయాలు, చాటువులు, బూతుల బుంగ, బాల సారస్వతం వంటి ఎంతో సాహిత్య సంపద ఇక్కడ ఉన్నా అచ్చుకు మాత్రం నోచుకోవడం లేదు. నేదునూరి గంగాధరం 22ఏళ్ల దీక్షగా జానపద వాఙ్మయ సేకరణ చేశారు. ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే తీరిక సమయాల్లో, సెలవు రోజుల్లో సొంత ఖర్చులతో గ్రామాలకు వెళ్లి పొలంలో, గ్రామ బడిలో, గుడిలో బస చేస్తూ ఒక్కోసారి భోజనం కూడా లేకుండా కాళ్లకు బలపం కట్టుకొని తిరిగేవారు. మరుగున పడిపోయిన ఎన్నో సాహిత్య ప్రక్రియలకు ప్రాణం పోశారు. పల్లె మాటలు, అంతరించిపోతున్న కమ్మని తెలుగు పదాల సంద్రాన్ని భావితరాలకు అందించాలనే తలంపుతో దేశం నలుమూలలా తిరిగి సాహిత్య సేకరణ చేశారు. 'తెలుగు పలుకుబడి తరబడి నుడిగారము నిగారముల నిండుకుండ ఈ వాఙ్మయమని గంగాధరం అనేవారు. ఆయన వాఙ్మయ సేకరణ తపస్సులో జేబు నిండుకుంటే నేనున్నానంటూ తన 50 కాసుల బంగారాన్ని, విలువైన చీరలను కూడా తృణప్రాయంగా ఇచ్చేసింది ఆయన సహధర్మ చారిణి గంగమాంబ. ప్రస్తుతం గంగాధరం కుమార్తె, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు యుందాని సూర్య ప్రభావతి ఈ గ్రంథాలయం బాగోగులు చూస్తున్నారు. చాలా ఏళ్ల కిందట ఓ లక్ష రూపాయలు తప్ప ఈనాటికీ అటు ప్రభుత్వం గానీ, ఇటు సాహిత్యాభిలాషులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో వెల కట్టలేని పద సంపద కాలగర్భంలోకి వెళ్లిపోయే స్థితికి చేరుతోంది.



నిర్మాణంలో ఉన్న మ్యూజియం కొత్త భవనం

రాళ్లబండి సుబ్బారావు మ్యూజియం

చరిత్ర విజ్ఞానాభివృద్ధే ధ్యేయంగా 1922 సెప్టెంబరులో ఆంధ్రేతిహాస పరిశోధక మండలిని రాజమహేంద్రవరంలో స్థాపించారు. 1926లో చరిత్ర పరిశోధకులు రాళ్లబండి సుబ్బారావు గౌరవ అధ్యక్షుడిగా సంస్థను రిజిస్టర్ చేయించారు. అప్పట్లోనే విజయనగరం రాజు విజయరామగజపతిరాజు భవన నిర్మాణానికి రూ.13 వేలు విరాళంగా ఇచ్చారు. 1967 మార్చి 1న ఆ సంస్థ పురావస్తుశాఖ ఆధీనంలోకి వెళ్లగా.. 'రాళ్లబండి సుబ్బారావు ప్రభుత్వ ప్రదర్శనశాల'గా నామకరణం చేశారు. ఇక్కడ ఎంతో అపురూపమైన చారిత్రక విశేషాలను పదిలపరిచారు. తామ్రశాసనాలు, తాళపత్ర గ్రంథాలు, చరిత్ర పుస్తకాలు ఎన్నో ఇక్కడ ఉన్నాయి. జానపద సంపద ఎంతో ఇక్కడ భద్రపరచబడి ఉంది. ప్రస్తుతం నూతన భవనాన్ని నిర్మిస్తున్నందున వాటిని బొమ్మూరులోని కాటన్ నివాస గృహంలో భద్రపరిచారు. కొత్త భవన నిర్మాణం నత్తనడకతో పోటీపడుతోంది.



వీరేశలింగం జన్మ గృహం

వీరేశలింగమొకడు మిగిలెను చాలు.. అన్నాడో కవి. అంతటి మహానుభావుడు తిరుగాడిన నేల ఇది. ఆయన స్వగృహం గోదావరి గట్టు సమీపంలో ఉంది. అక్కడే ఆయన సహధర్మచారిణి రాజ్య లక్ష్మమ్మ నివాసాన్ని కూడా చూడవచ్చు. వీరేశలింగం వస్త్రాలు, అయన కూర్చున కుర్చీ, అప్పట్లో ఆయన నడిపిన పత్రిక అచ్చు యంత్రంతోపాటు తొలి వితంతు వివాహ ఘట్టపు నమూనా ఇక్కడ ఉంది. వీరేశలింగానికి తన ఆదాయ వ్యయాలను రాసుకునే అలవాటు ఉంది. వాటితోపాటు కొందరు ఆయనకు రాసిన లేఖల ప్రతులు కూడా ఇక్కడ ఉన్నాయి. ఇవే కాకుండా సుమారు 10వేల పుస్తకాలను కూడా ఇక్కడ భద్రపరిచారు. కానీ ఈ గృహం ప్రస్తుతానికి శిథిలావస్థకు చేరుకొంది. దీంతో విద్యార్థులను అనుమతించడం లేదు. కొన్ని స్తంభాలు స్థానభ్రంశమై ముట్టుకుంటే పడిపోయే స్థితికొచ్చాయి. వీరేశలింగం దంపతుల సమాధులు ఉమెన్స్ కాలేజీ సమీపంలో 'ఆనంద నిలయం'లో ఉన్నాయి.








కాటన్ మ్యూజియం

సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు ఎలంటి రవాణా సదుపాయాలు లేని రోజుల్లో, అడవుల్లో తిరుగుతూ.. ఎంతో ప్రయాసతో ధవళేశ్వరం ఆనకట్ట కట్టి వృథాగా పోతున్న గోదావరి నీటిని ఒడిసిపట్టి లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేశారు. ఆనకట్ట నిర్మాణంలోని ఇంజనీరింగ్ నైపుణ్యం, వినియోగించిన యంత్రాలు, ఆనకట్ట నమూనా వంటి వాటితో కాటన్ మ్యూజియాన్ని 1988 ఫిబ్రవరి 25న అప్పటి సీఎం ఎన్టీ రామారావు ప్రారంభించారు. ఇక్కడికి వెళ్లి నమూనాలను, చిత్రాలను, యంత్రాలను చూస్తే ఆనకట్ట నిర్మాణం కళ్లకు కట్టినట్లుగా ఉంటుంది. కానీ నేడు ఈ మ్యూజియం నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. కనీసం గార్డెన్‌ని కూడా నిర్వహించలేని దుస్థితిలో ఉంది. గత పుష్కరాలకు నిధులు ఇవ్వడంతో కొంత మెరుగులు దిద్దారు. మళ్లీ పుష్కరాలు రానే వస్తున్నాయి. ఈ పదేళ్లలో సరైన నిర్వహణ లేకపోవడంతో కాటన్ మ్యూజియం కళ తప్పుతోంది.

కాకినాడ మ్యూజియం.. భద్రపరచిన విగ్రహాలు, తాళపత్రాలు







అద్భుత భాండాగారం.. కాకినాడ మ్యూజియం

చరిత్ర మానవజాతికి జీవగర్ర. అలాంటి చరిత్ర మనం తెలుసుకుని ముందుకు వెళితే భవిష్యత్తుకు అద్భుతమైన బాటలు వేస్తాయని చరిత్రకారులు చెప్పారు. అలాంటి చరిత్ర తెలుసుకోవాలంటే పురావస్తు పరిశోధనా సంస్థలు ప్రదర్శనశాలలు నేటి తరానికి అవసరం. వేల సంవత్సరాల కిందట నాటి తాళపత్ర గ్రంథాలతోపాటు వందల ఏళ్ల నాటి పురావస్తు ప్రదర్శనతో కాకినాడ మ్యూజియం ఒక అద్భుతంగా మనకు కనిపిస్తుంది. వివేకానంద పార్కు సమీపంలో కలిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు ప్రభుత్వ పురావస్తు ప్రదర్శనశాల, పరిశోధన సంస్థ. పరిశోధకులకు, సాహితప్రియులకు ఒక అపురూపం. ఇక్కడ కొన్నేళ్లకాలం నాటి శాసనాలు విగ్రహాలు, గ్రంథాలు మనకు అందుబాటులో ఉన్నాయి. పాండురంగని అద్దంకి శాసనం, యుద్ధమల్లుని బెజవాడ శాసనంతో సహా 88 శాసనాలు ఉభయగోదావరి జిల్లాల్లో జరిగిన తవ్వకాల్లో బయటపడిన పురాతన హైందవ బౌద్ధ జైన విగ్రహాల చారిత్రక వస్తువులు, కళాఖండాలు మనకు ఈ మ్యూజియంలో ఉన్నాయి. దాదాపు 5వేలకు పైబడిన తాళపత్ర గ్రంథాలు, సుమారు 500 వ్రాతప్రతులు, 1880 నుంచి ముద్రితమైన ఆంధ్ర కన్నడ, ఆంగ్ల సంస్కృత గ్రంథాలు పదివేలకు పైగా ఇక్కడ ఉన్నాయి. సాహిత్య చరిత్ర పత్రికలు ఆంధ్ర హిస్టారికల్ జర్నల్ భారతి, ఆంధ్ర సాహిత్య పరిషత్తు పత్రికలు కూడా ఈ పాత ప్రతుల్లో మనకు ఉన్నాయి. సిరాలేని సమయంలో కరక్కాయ రసంతో పాళీతో స్వయంగా శ్రీనాథుడు లిఖించిన శివరాత్రి మహత్యం కావ్యం కూడా ఇక్కడ మ్యూజియంలో ఉంది. శ్రీకృష్ణదేవరాయ కాలమనేటి తామర శాసనాలు, మొదటి ప్రపంచ యుద్ధంలో ఉపయోగించిన ఆయుధాలు, పాత శిలాయుగపు పనిముట్లు భద్రపరిచారు. పాత భవనం స్థానే కొత్త భవనం నిర్మించగా. త్వరలోనే మ్యూజియం కొత్త భవనంలోకి మారనుంది.

- కార్పొరేషన్(కాకినాడ)/ఆంధ్రజ్యోతి

రేపటి నుంచి ఏపీఈఏపీ సెట్ ప్రవేశ పరీక్షలు

» మొత్తం 3,62,448 దరఖాస్తులు
» 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ
» 21 నుంచి 27 వరకూ పరీక్షలు
» ఏపీఈఏపీసెట్ కన్వీనర్ సుబ్బారావు



ఏపీఈఏపీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు


జేఎన్టీయూకే, మే 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 19 నుంచి 27 వరకూ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్న ఏపీఈఏపీసెట్-2025కు 3,62,448 మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకున్నారని సెట్ చైర్మన్, జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఇంజనీరింగ్‌కు 2,80,612మంది, అగ్రికల్చర్ ఫార్మసీకి 81,836 రెండింటికీ 912 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. పరీక్షలు ఏపీలో 143, తెలంగాణాలోని హైదరాబాద్‌లో 2కేంద్రాలు మొత్తం 145 పరీక్షా కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో జరుగుతాయన్నారు. రూ.10,000 అపరాధ రసుముతో దరఖాస్తు చేసుకునేందుకు సంబంధించిన గడువు శుక్రవారంతో ముగిసింది. పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకూ రెండు సెషన్లలో జరుగుతాయన్నారు. అంగవైకల్యం కలిగిన ఆరుగురు విద్యార్థులకు సహాయకులను కేటాయించామని ఆన్‌లైన్ దరఖాస్తులో సమాచారాన్ని తప్పుగా పూరిస్తే ఆందోళన చెందవద్దని పరీక్ష పూర్తయిన తరువాత సహాయకేంద్రంలో సంప్రదిస్తే తప్పులను సవరిస్తామని తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తోపాటూ ఏదైనా ఒరిజినల్ గుర్తింపుకార్డును తీసుకువెళ్లాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి గంటన్నర ముందుగా ప్రవేశం కల్పిస్తారన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరని, రఫ్‌పేపర్లు తమవెంట తీసుకురాకూడదని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం అందుబాటులో ఉన్న పరీక్షాకేంద్రాన్ని కేటాయించామని, విద్యార్థులు తమ హాల్‌టికెట్లను ఏపీఈఏపీసెట్‌కు సంబంధించిన https://cets.apsche.ap.gov. in వెబ్‌సైట్‌తోపాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 9552300009 ఫోన్ నెంబరు ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. 19,20 తేదీల్లో అగ్రికల్చర్ ఫార్మసీ, 21నుంచి 27వరకూ ఇంజనీరింగ్ విభా గం పరీక్షలు 14 సెషన్లలో జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ఒక్కనిమిషం ఆల స్యంగా హాజరైనా అనుమతించరని తెలిపారు. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే 0884 2359599, 2342499 నెంబర్లలోకానీ, helpdeskapeapcet @ap sche.org మెయిల్ ఐడీ ద్వారా కానీ సంప్రదించవచ్చని కన్వీనర్ సూచించారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తరువాత వారికి కేటాయించిన పరీక్షా కేంద్రం రూట్‌మ్యాప్‌ను తెలుసుకునేందుకు హాల్‌టికెట్ చివరిపేజీలో గూగుల్‌మ్యాప్ ఇస్తామన్నారు. విద్యార్థికి కేటాయించిన పరీక్షా కేంద్రం పూర్తి చిరునామానుhttps://cets. apsche.ap.gov.in/eapcet/EAPCET_Centers.aspxద్వారా తెలుసుకోవడంతోపాటూ గూగుల్ మ్యాప్‌ను పొందవచ్చని సూచించారు.

- కాకినాడ జిల్లాలో ఈ పరీక్షలకు కాకినాడ జిల్లాలో 12,637మంది విద్యార్థులు హాజరుకానున్నారనివారిలో 8,957మంది ఇంజనీరింగ్, 3,680 మంది అగ్రికల్చర్‌ఫార్మసీ పరీక్షలు ఆన్‌లైన్‌లో రాయనున్నారన్నారు. జిల్లాలో ప్రగతి ఇంజనీరింగ్, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఆదిత్య యూనివర్శిటీ, కాకినాడ రాయుడుపాలెంలోని సాఫ్ట్ టెక్నాలజీ కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నారు.
- తూర్పుగోదావరిజిల్లాలోని రాజమహేంద్రవరం ప్రాంతీయకేంద్రం పరిధిలో 10,228మంది విద్యార్థులు హాజరుకానున్నారని వారిలో 7,643 మంది ఇంజనీరింగ్, 2585 మంది అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షలు రాయనున్నారుని లూథర్‌గిరిలో ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్, గైట్ కళాశాల కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నారు.
- డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోనసీమజిల్లా అమలాపురం ప్రాంతీయకేంద్రం పరిధిలో శ్రీనివాసా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బీవీసీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కేంద్రాల్లో నిర్వహించే ఈఏపీసెట్‌పరీక్షలకు 5,631మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఈరెండు కేం ద్రాల్లో ఇంజనీరింగ్ పరీక్షకు 4,030మంది, అగ్రికల్చర్ ఫార్మసీకి 1601మందివిద్యార్థులు పరీక్షలు రాయనున్నారని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు.

ముగిసిన శిక్షణ

కార్పొరేషన్(కాకినాడ), మే17(ఆంధ్రజ్యోతి): సిమెన్స్ టాటా స్టీవ్‌లో భాగంగాఈనెల 13నుంచి కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణాసంస్థలో రాజమండ్రి, ఏలూరు, భీమవరం, గుడివాడ, ప్రభుత్వ ఐటీఐలో పనిచేస్తున్న సిబ్బందికి నిర్వహించిన నూతన బోధనశాస్త్ర శిక్షణ శనివారంతో ముగిసింది. కన్వీనర్ ఎం.వేణుగోపా ల్‌వర్మ మాట్లాడుతూ ఉత్తమశిక్షణ ఇచ్చేందుకు ఐటీఐల అభివృద్ధికి, పరిశ్రమలకు స్కిల్ టెక్నీషియన్స్‌ను అందించడానికి ఉపయోగపడుతుందన్నారు. మాస్టర్ ట్రైనర్ అక్షయ్‌అజత్కుర్, ఎస్‌పీసీ మార్కండేయులు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సంతోష్, ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎంఎంఎస్ మూర్తి, టీవో పాల్గొన్నారు.

సంచలనాల చలం



ఆంధ్రజ్యోతి-కార్పొరేషన్(కాకినాడ): మైదానం.. ఈ పుస్తకం ఒక సంచలనం. స్త్రీ స్వేచ్ఛను స్త్రీ హక్కులను పురుష దురహంకారం మీద ప్రశ్నించిన పాశుపతాస్త్రం. ఈ పుస్తకం అప్పట్లో ఒక సంచలనం. 20వ శతాబ్దం తొలి నాళ్లలోనే స్త్రీవాదాన్ని, మహిళల హక్కులను ప్రశ్నిస్తూ సమాజాన్ని పరుగులు పెట్టించిన రచయిత సామాజిక ఉద్యమకారుడు, స్త్రీవాది గుడిపాటి వెంకటాచలం. చలంగా సుప్రసిద్ధమైన ఆయన రచనలు ఒక సంచలనం. 19వదశకాల్లో ఆయన రాసిన ప్రతి అక్షరం ఒక ప్రశ్న, సమాజాన్ని పట్టిపీడిస్తున్న భావజాలానికి ఒక హెచ్చరిక. నేడు చలం జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

» స్త్రీ వాదం ఆయన అభిమతం
» సమానత్వం ఆయన సాహిత్యం
» నేడు చలం జయంతి

కాకినాడతో అనుబంధం..

చలం రచించిన మైదానంతోపాటు స్త్రీ, రుక్మిణీ, చలం, అరుణోదయం జీవితం చింతామణి వంటి రచనలు సమాజానికి మేలుకొలుపునిచ్చారు. ఆయన రచనపట్ల కొందరు పురుష భావజాలం కలిగిన వాళ్లు అప్పట్లో ద్వేషించినప్పటికీ, నవసమాజానికి ఇవి నాంది పలికే ఆ రోజుల్లో స్త్రీలకు సంబంధించిన శారీరక సమస్యలను వ్యాధులకోసం బహిరంగంగా చర్చించిన ఆయన రచనలు మహిళా లోకానికి ఒక పునాది వేశాయి. అలాంటి చలానికి కాకినాడ ప్రాంతంతో ఎంతో అనుబంధం ఉంది. కృష్ణా జిల్లావాసి అయినప్పటికీ పీఆర్ కాలేజీలో చదువుకుని ఉన్నత చదువులకు మద్రాసు వెళ్లి అక్కడ కూడా చదువు పూర్తయిన తర్వాత తిరిగి కాకినాడ వచ్చి కళాశాల మీద ఉన్న అభిమానంతో పీఆర్ కాలేజీలో తిరిగి ట్యూటర్‌గా జీవితాన్ని ప్రారంభించారు. ఆయన రచనలకు నాంది పలకడానికి కాకినాడ ఒక సుప్రసిద్ధ వేదిక అయింది. ఎంతో మంది రచయితలకు ఆయన రచనలు ఒక మార్గాన్ని సూచించాయి. ఆయనపై పరిశోధనలకు ఆయన పుస్తకాలే ఆ యుధాలయ్యాయి. నేడు స్త్రీలు కోరుకుంటున్న స్వేచ్ఛను వందేళ్లక్రితమే ఆయన సూచించారు. స్త్రీవాదైన చలం ఎంతోమందికి ఆదర్శప్రాయుడు.

ఆధ్యాత్మికత కోసం బ్రహ్మ సమాజం

చలం బ్రహ్మసమాజానికి స్వచ్ఛందంగా చేరి ఆ వేదిక ద్వారా తన ఆధ్యాత్మికతను, తత్వశాస్త్రాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని తీర్చిదిద్దుకున్నాడు. ఆ అనుభవాల ప్రభావంతో వచ్చిన రచనలు ఆయన జీవితంలో ముఖ్యమైన మలుపును సూచిస్తాయి. ఆయన బ్రహ్మసమాజంలో కొంత కాలంసభ్యుడిగా ఉన్నప్పుడు పొందిన ఆలోచనలు, నిరాశలు, తాత్విక సందేహాలవన్నీ ఆయన రచనల్లో ప్రతిఫలించాయి. చలం శశిరేఖ, దైవమిచ్చిన భార్య, ప్రేమలేఖలు, జీవితాదర్శం వంటి రచనలతోపాటు తత్వవిజ్ఞానం, ఆధ్యాత్మిక స్వేచ్ఛ, దైవసంబంధం వంటి అంశాలపై పలు వ్యాసారాలు రాశారు. ఆయన బ్రహ్మ సమాజంలో తాను పొందినది ఏంటి, కోల్పోయినది ఏంటి అనే విషయాలపై స్వయంగా స్పందించారు. బ్రహ్మ సమాజం చలం మొదటిసారిగా ఒక వ్యూహాత్మక తాత్విక వేదిక ఇచ్చింది. ఆయనకి సంస్థాగత ఆచారాలు కంటే వ్యక్తిగత అన్వేషణ, జీవ అనుభూతి ఎక్కువగా ప్రాధాన్యంగా కనిపించాయి. చివరకు చలం తాను స్వతంత్ర ఆలోచనకర్తగా మారడానికి బ్రహ్మ సమాజం ఒక పాఠశాలా పనిచేసింది.


మైదానం.. ఇప్పటికీ సంచలనం



తొలితరం జర్నలిస్టులు చలం రచనలపై ఎంతో పరిశోధన చేసేవారు. ఈ నాటికీ పుస్తక ప్రియులకు, సామాజిక కార్యకర్తలకు, స్త్రీ వాదులకు సమాజం సమానత పాటించాలని కోరుకునే వారికి చలం రచనలు ఒక మార్గాన్ని సూచించాయి. ఇవి మాట్లాడకూడదు అనుకునే రోజుల్లో ఇవి కూడా మాట్లాడాలి.. అని నిరూపించినవే చలం ఆలోచనలు, రచనలు. ఆయన మైదానం పుస్తకం ఇప్పటికీ ఒక సంచలనం.

-నగేష్ బూర్తి, సీనియర్ జర్నలిస్టు, కాకినాడ

85ఏళ్ల సత్యాన్వేషి



ఒక అన్వేషిగా 85ఏళ్ల ఆయన చేసిన ప్రయాణసారాన్ని సహేతుకంగా వివరించిన పుస్తకం సత్యాన్వేషి. విశ్వవిద్యాలయాల పరిధిలో చలం మొత్తాన్ని ఒక అంశంగా తీసుకుని సత్యాన్వేషిగా అయన్ను నిరూపించిన సమగ్ర పరిశోధనకు నాకు ఆంధ్రవిశ్వవిద్యాలయం స్వర్ణపతకాన్ని బహూకరించింది. సత్యాన్వేషి అయిన చలం రచనలు మరో వందేళ్ల తర్వాత కూడా సమాజానికి తప్పనిసరి అవసరం.

-వాడ్రేవు వీరలక్ష్మిదేవి, రచయిత్రి, కాకినాడ

తీర్థయాత్రలకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైళ్లు

రాజమహేంద్రవరం, మే 17(ఆంధ్రజ్యోతి): వేసవిలో తీర్థయాత్రలకు వెళ్లే వారి కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైళ్లను నడుపుతోందని సంస్థ జేజీఎం కిషోర్ తెలిపారు. మే 22 నుంచి 30 వరకూ జరిగే దివ్య దక్షిణ యాత్రలో అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరు చూడవచ్చన్నారు. ఈ రైలు రాజమండ్రి రాదని, ఈ ప్రాంతంవారు విజయవాడలో ఎక్కవచ్చని తెలిపారు. అలాగే జూన్ 14 నుంచి 22 వరకూ గంగా రామాయణ పుణ్యక్షేత్ర యాత్రలో భాగంగా వారాణసీ, అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగ్‌రాజ్, శంగవర్పూర్ ప్రాంతాలను దర్శించవచ్చన్నారు. ఈ రైలు రాజమండ్రి వస్తుందన్నారు. జూలై 5 నుంచి 13 వరకూ ఐదు జ్యోతిర్లింగాల యాత్రలో త్రయంబ కేశ్వర్, భీమ శంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా గుహలు, మోవ్, నాగ్పూర్‌లను చూడవచ్చన్నారు. ఈ రైలు సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ గుండా వెళ్తుందన్నారు. మరిన్ని వివరాలకు 9701360701లో సంప్రదించాలని కోరారు.

మెము రైలు తాత్కాలికంగా రద్దు

సామర్లకోట, మే 17 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం-విశాఖల మధ్య రాకపోకలు సాగించే మెము రైలును తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు రాత్రి అందిన సమాచారం మేరకు 67286 నంబరు గల మెము రైలును ఈ నెల 17 ఆదివారం నుంచి 19 మంగళవారం వరకూ తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపారు.

పాపం పండినట్టే!

తొండంగి విలేకరి హత్యకేసు విచారణలో కీలక మలుపు

- కేసులో సమర్ధ వాదనకు స్పెషల్ కౌన్సిల్‌గా మోహనమురళిని దించిన ప్రభుత్వం
- సీబీఐ తరపున క్రిమినల్ కేసులు వాదించడంలో మురళి దిట్టగా గుర్తింపు
- జీవోఆర్టీ నెంబరు 771జారీ చేసిన రాష్ట్ర హోంశాఖ
- ప్రభుత్వం మారడంతో ఇప్పటికే ఈ కేసును మళ్లీ లోతుగా విచారిస్తోన్న సీఐడీ
- దాడిశెట్టి రాజా ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించి ఇప్పటికే ఏ1గా చేర్చేందుకు నిర్ణయం
- అటు హత్యకు సంబంధించి పూర్తిగా లోతైన ఆధారాల సేకరణలో నిమగ్నం
- హత్య అనంతరం నమోదు చేసిన చార్జిషీటూ తప్పులతడక
- దీనివెనుక కారణాలపైనా దర్యాప్తు
- త్వరలో పక్కా ఆధారాలతో కొత్తగా మరో చార్జిషీటు దాఖలకు ప్రయత్నం


హత్యకు గురైన సత్యనారాయణ (ఫైల్)

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి తొండంగి విలేకరి కాతా సత్యనారాయణ హత్య కేసు విచారణలో కీలక మలుపు చోటు చేసుకుంది. న్యాయస్థానంలో ఈ కేసును సమర్థవంతంగా వాదించి నిందితులకు శిక్ష పడేలా చేయడానికి ప్రభుత్వం స్పెషల్ కౌన్సిల్‌ను నియమించింది. గతంలో సీబీఐ తరఫున క్రిమినల్ కేసులు వాదించిన కాకినాడకు చెందిన న్యాయవాది మోహనమురళీని రంగంలోకి దించింది. ఈమేరకు హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. అటు ఇప్పటికే ఈకేసులో రాజమహేంద్ర వరం సీఐడీ విచారణలో స్పీడు పెంచింది. ప్రభుత్వం మారడంతో పాతకేసులో లోపాలను సరిదిద్ది మళ్లీ కేసు విచారణ చేపట్టింది. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పాత్రను నిర్ధారిస్తూ త్వరలో కొత్త చార్జిషీటు దాఖలకు సిద్ధమవుతోంది. మరోపక్క ఈ కేసులో తనను అరెస్ట్ చేయకుండా ఆదేశాలు జారీచేయాలని రాజా హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం బెయిల్ తిరస్కరించింది.

కిరాతకంగా నరికించినా బయటే...

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తొండంగి మండలం ఆంధ్రజ్యోతి విలేకరిగా పని చేసిన కాతా సత్యనారాయణ 2019 అక్టోబరు 15న హత్యకు గురయ్యారు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో రాత్రివేళ కొందరు ఆగంతకులు అప్పటి తుని వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న దాడిశెట్టి రాజా నివాసానికి దగ్గరలో లక్ష్మీదేవి చెరువు గట్టుపై మాటు వేసి సత్యనారాయణను హత మార్చారు. ద్విచక్రవాహనంపై ఎస్.అన్నవరంలోని తన నివాసానికి చేరుకునే క్రమంలో కిరాయి రౌడీలు మారణాయుధాలతో సత్యనారాయణను అతి కిరాతకంగా హతమార్చడం అప్పట్లో సంచలనమైంది. ఈ సంఘటనపై అప్పట్లో ప్రజా సంఘాలు, జర్నలిస్టు సంఘాలు తునిలో ఆందోళనబాట పట్టాయి. ఈ హత్యకు వైసీపీ నేత దాడిశెట్టి రాజా సూత్రధారి అని మృతుడి కుటుంబసభ్యులు అప్పట్లో ఆరోపించారు. పైగా హత్యకు కొన్ని రోజుల ముందు సెప్టెంబరులో తనకు రాజా అనుచరుల నుంచి బెదిరింపు ఫోన్లు వస్తున్నాయంటూ ఆధారాలతో సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా రాజా ఒత్తిడితో పోలీసులు పట్టించు కోలేదు. అయితే సంచలనం రేకెత్తించిన ఈ కేసుపై తుని రూరల్ పోలీసులు అప్పుడు కేసు నమోదు చేసి దాడిశెట్టి రాజాతో పాటుగా ఆరుగురి నిందితులను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. అయితే అప్పట్లో వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న దాడిశెట్టి రాజా కేసును నీరుగార్చడంతో పాటు ఆయనతో పాటు కేసులో ఉన్న కొందరు అనుచరులను కేసు నుంచి బయటపడేసేందుకు తన అధికారం అడ్డం పెట్టుకున్నారు. కేసు నమోదైనా అరెస్ట్ అవకుండా అప్పటి అధికార పార్టీ పెద్దల ద్వారా పోలీసులపైఒత్తిడి తెచ్చారు.

హత్యతో సంబంధం లేదని బుకాయింపు

ఈలోపు దాడిశెట్టి రాజాకు మంత్రి పదవి లభించింది. దీంతో కేసు మరింత నీరుగారిపోయింది. అసలే రాజా మంత్రి కావడంతో అప్పటి పోలీసులు ఆయన జోలికి వెళ్లడానికి సాహసించలేదు. తెరవెనుక ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లు కూడా ఉండడంతో 2023లో దాఖలు చేసిన చార్జ్‌షీట్ నుంచి మంత్రిగా ఉన్న దాడిశెట్టి రాజా పేరును పోలీసులు తొలగించారు. అసలు రాజాకు హత్యతో సంబంధం లేదని బుకాయించారు. ఆర్థిక కారణాలతో హత్య జరిగిందంటూ కేసును తప్పుదోవ పట్టించి మమ అనిపించారు. దీనిపై న్యాయవాది అయిన సత్యనారాయణ సోదరుడు గోపాలకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజా పాత్రకు సంబంధించి ఆధారాలు, పలుసార్లు రాజా అనుచరులు తన సోదరుడిని బెదిరించిన ఘటనలకు సంబం ధించిన వివరాలు న్యాయస్థానానికి అందించారు. అటు అసెంబ్లీ ఎన్నికలకు ముందు నారా లోకేశ్ యువగళం పాద యాత్రలో తుని వచ్చిన సమయంలో సత్యనారా యణ కుటుంబ సభ్యులులోకేశ్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. రాజా తన అధికారాన్ని అడ్డం పెట్టు కుని కేసు లేకుండా చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో లోకేశ్ స్పందిస్తూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తప్పకుండా న్యాయం చే స్తామని హామీఇచ్చారు. అనుకున్నట్లుగానే ప్రభుత్వం మారడంతో పోలీసులు మళ్లీ హత్య కేసును తిరిగి తెరిచారు. ఆధారాలున్నా సరే రాజాపై కేసు నమోదు చేయకుండా అప్పటి పోలీసులు వ్యవహరించారని తేల్చారు. దీంతో కొన్నినెలల కిందట తిరిగి దాడిశెట్టి రాజాను పోలీసులు హత్య కేసులో ప్రధాన నిందితుడిగా చేర్చారు. ఫలితంగా అరెస్ట్ తప్పదనే భయంతో రాజా ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయ స్థానం రాజాకు ముందస్తు బెయిల్ నిరాకరించింది. పోలీసుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. ఇదిలా ఉంటే గతేడాది నవంబరులో ఈ కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. దీంతో రాజమ హేంద్రవరం సీఐడీ డీఎస్పీ ఆధ్వర్యంలో ఈ కేసుపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. హత్యకు ముందు తర్వాత జరిగిన పరిణామాలు, సత్యనారాయణకు వచ్చిన బెదిరింపులు, హత్య తర్వాత కేసు నమోదు, చార్జిషీటు దాఖలు వెనుక ఒత్తిళ్లు వీటన్నింటిపై లోతుగా దర్యాప్తు కొనసాగిస్తోంది. వీటన్నింటి క్రోడీకరించి పక్కా ఆధారాలతో త్వరలో అరెస్టులు, కొత్తగా చార్జిషీటు దాఖలు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. అయితే కేసులో లోతైన దర్యాప్తు జరిగితే తమకు ఉచ్చుబిగుసుకోవడం ఖాయమనే భయంతో కేసులో నిందితులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. తదుపరి విచారణ జరగకుండా స్టే కోరారు. దీన్ని వెకేట్ చేయించేందుకు అటుప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఇక కేసు పరుగే..

కాతా సత్యనారాయణ హత్యకేసు విచారణకు సంబంధించి ప్రస్తుతం న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు అంత సమర్థవంతంగా లేవని బాధిత కుటుంబం ఆందోళన వ్యక్తంచేస్తోంది. కేసు విచారణలో తరచు ప్రభుత్వ న్యాయవాదులు మారుతుండడంతో అదేపనిగా విచారణలో కాలయాపన జరుగుతోందని చెబుతోంది. ఈ నేపథ్యంలో ఇకపై ఆసమస్యలు లేకుండా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విచారణ వేగంగా జరిగి బాధితులకు న్యాయం జరిగేలా చేయడం కోసం ప్రత్యేకంగా స్పెషల్ కౌన్సిల్‌ను నియమించింది. జి.మోహన మురళీ అనే న్యాయవాదిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. కాకినాడకు చెందిన మురళీ గతంలో కాకినాడ మూడో జిల్లా కోర్టు ఏపీపీగా పనిచేశారు. ముంబైలో సీబీఐ పీపీగా అనేక క్రిమినల్ కేసులను సమర్థవంతంగా వాదించారు. విలేకరి హత్య కేసు విచారణలో సమర్థవంతంగా ప్రాసిక్యూషన్ వాదన వినిపించడం కోసం ప్రభుత్వం ఈయన్ను రంగంలోకి దించడం కేసు విచారణలో కీలక మలుపనే చెప్పాలి.

దైవ దర్శనానికి పయనమై.. అనంతలోకాలకు!

- పాదయాత్ర చేస్తుండగా ఢీకొన్న వాహనం
- పిఠాపురంలో భక్తురాలు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు


ఫైల్‌ఫొటో


పిఠాపురం బైపాస్‌రోడ్డులో జరిగిన ప్రమాదంలో మరణించిన చంద్రకళ

పిఠాపురం/గొల్లప్రోలు, మే 17 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి పాదయాత్రగా ఇంటి నుంచి బయలుదేరిన మహిళ మరణించింది. దర్శనం చేసుకుని వచ్చేస్తానని చెప్పిన ఆమె ఇక రాదని తెలుసుకుని భర్త, కుమారుడు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాకినా డ జిల్లా గొల్లప్రోలు పట్టణానికి చెందిన అడపా చంద్రకళ(35), తొగరు సూర్యలక్ష్మి శనివారం ఉదయం 5గంటలకు ఇంటి వద్ద నుంచి కాలినడకన దివిలి వద్ద గల తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి దర్శనానికి బయలుదేరారు. పిఠాపురం బైపాస్‌రోడ్డులో రాపర్తి సెంటర్ సమీపంలోకి వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ప్రమాదంలో చంద్రకళ అక్కడికక్కడే మరణించగా, సూర్యలక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. సూర్యలక్ష్మిని చికిత్స నిమిత్తం ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. చంద్రకళకు భర్త త్రిమూర్తులు, కుమారుడు రాజేష్ ఉన్నారు. త్రిమూర్తులు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రాజేష్ పదో తరగతి పూర్తి చేసుకుని పిఠాపురంలోని కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. రాజేష్‌ను మేనమామ చదివిస్తున్నాడు. వీరు పూరిపాకలో నివసిస్తున్నారు. చంద్రకళ మరణవార్త విని భర్త, కుమారుడు, బంధువుల్లో విషాదం అలముకుంది. తొలి తిరుపతి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిందని, ఇలా మరణవార్త వినాల్సి వస్తుందని అనుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన మహిళను ఆసుపత్రికి తీసుకెళ్తున్న దృశ్యం

గుడికి వెళ్లి వస్తుండగా విషాదం

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు
- మహిళ మృతి
- నలుగురికి తీవ్రగాయాలు


సంఘటనా స్థలంలో బస్సు, కారు


మృతి చెందిన రేఖాలక్ష్మి


గాయపడిన శ్రావణ్‌కుమార్

అంబాజీపేట, మే 17(ఆంధ్రజ్యోతి): గుడికి వెళ్లి వస్తూ ఓ కుటుంబం ప్రమాదానికి గురైంది. ఆర్టీసీ బస్సును కారు ఢీకొనడంతో మహిళ మృతిచెందగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ముక్కామల- వక్కలంక వంతెన సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన దొమ్మేటి శ్రావణ్‌కుమార్, అతడి భార్య రేఖాలక్ష్మీ, కుమార్తెలు లాస్య, మోహనగని ప్రియరేఖా అమ్మమ్మ కె.ధనలక్ష్మితో కలిసి వారం రోజులుగా క్రితం కోనసీమ జిల్లా వానపల్లిలో జరిగే పళ్లాలమ్మ తీర్థానికి వచ్చారు. వారం పాటు బంధువుల ఇళ్లకు ఆనందంగా తిరిగారు. శనివారం కారులో ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దైవదర్శనానికి వెళ్లి అమలాపురం వైపు ఫ్రెంచ్ యానాం వెళ్తుండగా అమలాపురం నుంచి విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సును వక్కలంక వంతెన సమీపంలోకి వచ్చేసరికి బలంగా కారు ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్రగాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను అమలాపురం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తీసుకువెళ్తుండగా రేఖాలక్ష్మి(38) మృతిచెందింది. శ్రావణ్‌కుమార్, మోహనగనిప్రియ, లాస్య, ధనలక్ష్మిలకు తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కారు నుజ్జునుజ్జయింది. ప్రమాద స్థలాన్ని ఎస్ఐ కె.చిరంజీవి పరిశీలించి వివరాలు సేకరించారు. రేఖాలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. శ్రావణ్ కుమార్ స్వగ్రామం ఫ్రెంచి యానాం కాగా ఆయన రంగారెడ్డి జిల్లా నిజామ్‌పేటలో స్థిరపడ్డారు. రేఖాలక్ష్మి అమ్మగారి ఇళ్లు అమలాపురం.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


ముమ్మిడివరం: బొండాయికోడులో మృతిచెందిన సత్యనారాయణరాజు

ముమ్మిడివరం, మే 17(ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ బొండాయికోడు పెట్రోలు బంకు వద్ద శనివారం జరిగింది. అయినవిల్లి మండలం పోతుకుర్రు గ్రామానికి చెందిన సాగిరాజు సత్యనారాయణరాజు (47) చెరువులు దగ్గరికి వెళ్తూ పెట్రోల్ బంకులో డీజిల్ కొట్టించుకునేందుకు వెళుతుండగా ఎదురుగా అమలాపురం వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో సత్యనారాయణరాజు తీవ్రంగా గాయపడ్డాడు. అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సత్యనారాయణకు భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కత్తిపూడిలో...

శంఖవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలో ఓ సినిమాహాలు ఆవరణలో లారీ ఢీకొనడంతో గొంతాల అప్పలరాజు(48) మృతిచెందాడు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు వివరాల ప్రకారం.. కిర్లంపూడి మండలం వీరవరం గ్రామానికి చెందిన అప్పలరాజు కత్తిపూడిలో నివాసం ఉంటున్నాడు. కూల్‌డ్రింక్ గోడౌన్ వద్ద లోడుతో ఓ లారీ ఆగి ఉంది. నీడగా ఉంటుందని లారీ కింద విశ్రాంతి తీసుకునేందుకు వెళ్లాడు. అతడిని గుర్తించని లారీ డ్రైవర్ ముందుకు వెళ్లడంతో అప్పలరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.


కత్తిపూడిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీహరిబాబు

గోదావరిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఆత్రేయపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): గౌతమి గోదావరిలో బహిర్భూమికి వెళ్లి కాలు జారి గల్లంతైన యువకుడు మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన తలపాకుల జగపతిబాబు(20) హైదరబాద్‌లో ఓ కంపెనీలో ఆఫీస్‌బాయ్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఆత్రేయపురం బుల్లిపేటలో తన మేనమామ కుమారుడు పుట్టిన రోజు వేడుకకు వచ్చాడు. మధ్యాహ్నం గోదావరి వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి గల్లంతయ్యాడు. గాలింపు చర్యలు చేపట్టగా శనివారం సాయంత్రం రావులపాలెం జొన్నాడ బ్రిడ్జి వద్ద మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము చెప్పారు.


జగపతిబాబు మృతదేహం

సామర్లకోట చైర్‌పర్సన్ రాజీనామా లేఖ ఉపసంహరణ

సామర్లకోట, మే 17 (ఆంధ్రజ్యోతి): తన పదవికి రాజీనామా చేసిన కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ జీ.అరుణ తన రాజీనామా లేఖ ఉపసంహరించుకుంటున్నట్టు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యకు శనివారం లేఖ అందజేశారు. ఈనెల 15న కమిషనర్‌కు అందజేసిన రాజీనామా పత్రాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు తెలిపారు. అదేరోజు జరిగిన మున్సిపల్ ప్రత్యేక సమావేశంలో వైసీపీకి చెందిన 25మంది మెజార్టీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించి నెగ్గిన విషయం విధితమే. అయితే తాను కోర్టులో చేసిన అభ్యర్థన కోర్టు పరిశీలనలో ఉన్నందున రాజీనామా ఉప సంహరించుకుంటున్నట్టు అరుణ తెలిపారు. కాగా కౌన్సిల్‌లో అనిశ్చిత పరిస్థితులపై ఉన్నతాధికారుల లేఖ రాసినట్టు ఆ మేరకు వెలువడే ఉత్తర్వుల ద్వారా తదుపరి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.


కమిషనర్‌కు రాజీనామా ఉపసంహరణ లేఖను అందజేస్తున్న అరుణ

పోక్సో కేసు తీవ్రత ఆధారంగా
నిందితులపై రౌడీషీట్

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

రాజమహేంద్రవరం/ ఉండ్రాజవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసు తీవ్రత ఆధారంగా నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ చెప్పారు. శనివారం ఆయన తూర్పుగోదావరి రాజమహేంద్రవరంలో జిల్లా పోలీసు కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో వార్షిక తనిఖీలు చేశారు. తొలుత జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని ఏఆర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పోలీస్ విగ్రహాన్ని ప్రారంభించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌బీ, డీసీఆర్‌బీ, కంట్రోల్ రూమ్, ఐటీ కోర్, ఏఆర్, ఎంటీ తదితర విభాగాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అతి తీవ్ర, తీవ్ర నేరాల దర్యాప్తులపై ఆరా తీశారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లోని పబ్లిక్ అడ్రసింగ్ వ్యవస్థ, కౌన్సెలింగ్ కేంద్రాలు, రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఫ్రెండ్లీ, విజిబుల్ పోలీసింగ్‌కి ప్రాధాన్యమివ్వాలన్నారు. భవిష్యత్తులో ఎలాంటి రిమార్క్ లేకుండా సర్వీసు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలోని శాంతి భద్రతలు, నేరాల తీరును ఎస్పీ నరసింహ కిశోర్ వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీ ఎం.మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎల్.చెంచిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే సాయంత్రం ఆయన ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి విలేకర్లతో మాట్లాడారు. ప్రజలు తమ ఫిర్యాదులను వెబ్‌సైట్ ద్వారా అందజేసి పోలీసు సాంకేతికను వినియోగించుకోవలాని సూచించారు. రాజమండ్రిలో గంజాయి రవాణా చేసే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్టేషన్‌లో పలు రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, డీఎస్పీ జి.దేవకుమార్, సీఐ పీవీజీ తిలక్, ఎస్ఐ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో అశోక్‌కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్

వివాహేతర సంబంధం నేపథ్యంలో
ఇద్దరి ఆత్మహత్య

కాకినాడ జిల్లా వేట్లపాలెంలో రైలు కింద పడి దుర్మరణం



పోసిబాబు (ఫైల్)

సామర్లకోట, మే 17 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో మనస్తాపంతో కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్ల పాలెం రైల్వేస్టేషన్ రైలు పట్టాల వద్ద రైలు కింద తలలు పెట్టి ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే కాకినాడకు చెందిన ఉప్పల పోసిబాబు(37)ప్రైవేట్ అకౌంటెంట్. 15 ఏళ్ల క్రితమే వివాహమై 14ఏళ్ల కుమారుడు, 12 ఏళ్ల కుమార్తె ఉన్నారు. ఇటీవల కాకినాడలో ఒక ప్రైవేట్ ల్యాబ్‌లో పనిచేస్తున్న వివాహిత దివ్య నాగలక్ష్మి(30) పరిచయం కావడంతో అది వివాహేతర సంబంధానికి దారితీసింది. అప్పటికే వివాహమైన దివ్యకు 8 ఏళ్ల కుమార్తె ఉంది. పోసిబాబు, దివ్య మధ్య రెండో వివాహం చేసుకోవాలనుకున్నారు. 4 రోజుల క్రితం పోసిబాబు ఈ విషయం సూత్రప్రాయంగా చెప్పి పక్క ఇంటిలోనే కాపురం ఉంటుందని చెప్పడంతో భార్య తీవ్రంగా వ్యతిరేకించింది. పలువురు పెద్దలతో చెప్పడంతో ఇటువంటి వ్యవహారం మంచిది కాదని సూచించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన పోసిబాబు, నాగలక్ష్మి కలిసి ఆత్మహత్యకు చేసుకుందామని నిర్ణయించుకుని శనివారం ఉదయం కాకి నాడ నుంచి వేట్లపాలెం రైల్వే స్టేషన్‌కు చేరు కున్నారు. వేగంగా వెళ్తున్న రైలు కింద తలలు పెట్టడంతో వారి శరీరాలు ముక్క ముక్కలయ్యాయి. ముఖాలు పూర్తిగా ఛిద్రం కావడంతో గుర్తుపట్టలేని రీతిలో మారాయి. మృతదేహాల వద్ద లభించిన సూసైడ్ నోట్‌ను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని కాకినాడ లోని ఇరు కుటుంబాల వ్యక్తులకు సమాచారం అందించారు. తమ అనుబంధానికి కుటుంబ సభ్యులే గాకుండా పెద్దలు సైతం అడ్డు తగి లారని అందుకే బతుకుపై విరక్తి చెంది ఆత్మ హత్యకు పాల్పడుతున్నామని రాసినట్టు పోలీసులు గుర్తించారు. ఆర్థిక పరమైన అంశాలు సైతం సూసైడ్ నోట్‌లో పొందుపరిచినట్లు సమాచా రం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించి రైల్వే ఎస్ఐ వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

కోకో రైతులను ఆదుకుంటాం : మంత్రి దుర్గేష్

నిడదవోలు, మే 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో కోకో గింజలను కిలో రూ.500 ధరకు కొనుగోలు చేసేందుకు మాండలీజ్ సంస్థ అంగీకరించిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మంత్రి క్యాంపు కార్యాలయంలో కోకో రైతులు, ట్రేడర్లు అధికారులతో ఆయన కోకో కొనుగోళ్లు, గిట్టుబాటు ధరలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 2520 హెక్టార్ల దిగుబడి విస్తీర్ణంలో 2353 మంది రైతులకు సుమారు 2000 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని, రైతులు అహర్నిశలు శ్రమించి పండించిన కోకో గింజలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం కోకో రైతులకు అండగా ఉంటుందని హామీ ఇవ్వడంతో తమ ఆందోళన విర మిస్తున్నట్టు కోకో రైతులు ప్రకటించారు. సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవో రాణీ సుస్మిత, హార్టికల్చర్ అధికారి బి.సుజాత, జిల్లాలోని కోకో రైతులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ చిత్రం విడుదల


సీసీ ఫుటేజీలో చైన్ స్నాచర్

కరప, మే 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరపలో బాలిక మెడలోని బంగారు గొలుసును అపహరించుకుపోయిన చైన్ స్నాచర్ చిత్రాన్ని శనివారం కరప పోలీసులు విడుదల చేశారు. ఎస్ఐ తోట సునీత మాట్లాడుతూ నక్కా లక్ష్మీఅలేఖ్య అనే మహిళ ఈనెల 11న కుమార్తె హాసికను స్కూటీపై ఎక్కించుకుని కాకినాడ నుంచి కరప మండలం జడ్.బావారానికి బయలుదేరింది. వీరిని అనుసరిస్తూ వచ్చిన చైన్‌స్నాచర్ కరప డంపింగ్ యార్డు వద్ద హాసిక మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. పలు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. నిందితుడు ముఖానికి మాస్క్ ధరించి ఉన్నాడని, ఫేక్ నెంబర్ బోర్డు తగిలించుకున్న మోటార్‌సైకిల్‌పై వచ్చి చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడని తెలిపారు. ఆచూకీ తెలిస్తే కరప పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తి వివరాలు గోప్యంగా ఉంచి బహుమతి ఇస్తామని ఎస్ఐ ప్రకటించారు.

గొందిలో సీఐ పల్లెనిద్ర

అంతర్వేది, మే 17(ఆంధ్రజ్యోతి): గొంది గ్రామంలో శనివారం రాత్రి సీఐ నవీన్‌నరసింహమూర్తి పల్లెనిద్ర చేశారు. తొలుత మత్స్యకారులతో మాట్లాడారు. మత్స్యకారులకు, తీర ప్రాంత ప్రజలకు ఉపద్రవాల నుంచి ముప్పు వాటిల్లకుండా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగార్జునరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడ్డాలపాలెంలో మట్టి అక్రమ తరలింపు

అంతర్వేది, మే 17(ఆంధ్రజ్యోతి): అడ్డాలపాలెం చొప్పలవారిపేటలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రభుత్వం ఎన్ని హెచ్చరికలు చేసినా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం: ఎమ్మెల్యే దేవ

రాజోలు, మే 17(ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. కూనవరం, వేగివారిపాలెం, శివకోటిలో కాల్వలు, డ్రెయిన్లలో పూడికతీత పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం చేదోడు వాదోడుగా ఉంటుందని పేర్కొన్నారు. రాజోలు నియోజకవర్గంలో 14వేల ఎకరాల ఆయకట్టు ఉండగా 3400 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారని, కనీసం 10వేల ఎకరాల్లో రైతులతో పంట పండించడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు నియోజకవర్గ పోలింగ్ బూత్ కమిటీల కోఆర్డినేటర్ చాగంటి స్వామి, కడలి నీటిసంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, రాపాక మల్లికార్జున, వైస్ ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు, చెల్లింగి జానకి రామయ్య, త్రినాథరావు, కాండ్రేగుల మణిబాబు, కుడుపూడి గణేశ్వరరావు, దిరిశాల బాలాజీ, డ్రెయిన్స్ డీఈఈ ఆర్.నాగార్జున, ఏఈఈ ఆనంద కిరణ్, ఇరిగేషన్ ఏఈఈ రమేష్ పాల్గొన్నారు.


రాజోలు: వేగివారిపాలెంలో కాల్వలో పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ

రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి

మలికిపురం, మే 17(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రైతులకు మేలు చేసే కార్యక్రమం చేపట్టామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గూడపల్లిలో నంబర్-1, నంబర్-2 కాల్వల పూడికతీత పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.64లక్షలతో ఈ ఏడాది పలు పంట కాల్వల్లో పూడికతీత పనులు చేపడతానన్నారు. మిగిలిన కాల్వలు ఏడాది పొడవునా నిర్వహణకు రూ.84లక్షలు మంజూరైందన్నారు. మిగిలిన పనులు చేయడానికి ప్రతిపాదనలు జలవనరులశాఖకు పంపామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షుడు రాపాక మల్లికార్జునరావు, డీసీ పినిశెట్టి బుజ్జి, ఆకన బాబ్జినాయుడు, దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, డీఈ నాగార్జున, ఏఈ రమేష్, ఆనందకిరణ్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మామిడికుదురు, మే 17(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మగటపల్లి గ్రామంలో పంటకాల్వ పూడికతీత పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారు ప్రాంతాలకు సాగునీరు అందేవిధంగా పంటకాల్వలను ఆధునీకరణ చేస్తున్నామన్నారు. కాల్వ పూడికతీత పనులు పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, డెల్టా నీటి సంఘ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షుడు కడలి కృష్ణమోహన్, నాయకులు ఈలి శ్రీనివాస్, వర్ధినేని బాబ్జి, చాగంటి స్వామి, కుంచే శ్రీనివాస్, బొలిశెట్టి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ స్వచ్ఛాంధ్రప్రదేశ్‌కు కృషి చేయాలి

- రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- జిల్లాలో స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర ర్యాలీ

మామిడికుదురు, మే 17(ఆంధ్రజ్యోతి):ప్రతీ పౌరుడు రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ చేసే దిశగా కృషి చేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. మగటపల్లి గ్రామంలో స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌పై అవగాహన ర్యాలీ శనివారం జరిగింది. ఎమ్మెల్యే, జడ్పీ మాజీ చైర్మన్ పాల్గొని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి కనకదుర్గమ్మ ఆలయం వరకు గల రోడ్డును శుభ్రపర్చారు. ప్రతీ ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఈలి శ్రీనివాస్, వర్ధినేని బాబ్జి, దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, చెల్లింగి సింహాచలం, కుంచే శ్రీనివాస్, యాలంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మామిడికుదురులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉప సంచాలకుడు సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు వెంకన్నబాబు, లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ వర్ధినేని రాము తదితరులు పాల్గొన్నారు.


మామిడికుదురు: మగటపల్లిలో జరిగిన స్వచ్ఛతా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవ తదితరులు

నాయకులు వాసంశెట్టి కుమార్, పాలూరి ఫణి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అందంగా గ్రామాలను తీర్చిదిద్దాలి

పి.గన్నవరం, మే 17(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతంగా ప్రతీ గ్రామాన్ని తీర్చి దిద్దేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా నాగుల్లంకలో ప్రధాన పంటకాల్వ గట్టుపై చెత్త తొలగింపు ప్రక్రియను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అలాగే పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్, నాగుల్లంక సెంటర్‌లో చలివేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే పలుచోట్ల కాల్వ గట్లపై ఎమ్మెల్యే మొక్కలు నాటారు. గంటిపెదపూడి నుంచి వాడ్రేవుపల్లి వరకు ఉపాధి కూలీలతో ప్రధాన పంటకాల్వ గట్టుపై చెత్తను తొలగించే కార్యక్రమం నిర్వహించామని ఎంపీడీవో కేవీ ప్రసాద్ తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పి.శ్రీపల్లవి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్‌లు బొండాడ నాగమణి, యల్లమిల్లి కృష్ణవేణి, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు,

మొక్కలు నాటిన ఈడీ విజయరత్నం

అమలాపురం, మే 17(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం ఆధ్వర్యంలో అమలాపురంలోని ఆర్టీసీ డిపోలో శనివారం స్వచ్ఛాంధ్ర దివస్ కార్యక్రమం వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా ఈడీ విజయరత్నం, జిల్లా ప్రజారవాణాధికారి రాఘవ్‌కుమార్, డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తిల ఆధ్వర్యంలో డిపో గ్యారేజీ ఆవరణలో మొక్కలు నాటారు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిపో సిబ్బందికి ఈడీ విజయరత్నం సూచించారు. బీట్ ది హీట్ నినాదాంతో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అందరికీ మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపోకు చెందిన ఏఈ జీఆర్ఎస్ఎల్ దేవి, అసిస్టెంట్ మేనేజర్ ప్రతిమాకుమారి, సూపర్‌వైజర్ వరహాలబాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర ర్యాలీ

అంబాజీపేట, మే 17(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రం ఉంచుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో భీమారావు సూచించారు. స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మాచవరం, గంగలకుర్రు, ముక్కామల గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాలను పరిశుభ్రంగా చేశారు. మాచవరం పంచాయతీ వద్ద ప్రతిజ్ఞ చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

రాజోలు, మే 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీపీ కేతా శ్రీను పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం


అమలాపురం ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటుతున్న ఈడీ విజయరత్నం

ఎంపీపీ కేతా శ్రీను ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణాన్ని కార్యాలయ సిబ్బంది శుభ్రం చేశారు. తొలుత మహిళలతో ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏవో ఎంపీవీ సత్యనారాయణ, చక్రవర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంట మొక్కలు నాటాలి

అమలాపురం రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి డివిజన్ పంచాయతీ అధికారి పి.బుజ్జిరాజు ఆధ్వర్యంలో హీట్ ది బీట్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం, చలివేంద్రాన్ని కామనగరువులో ఏర్పాటుచేశారు. పంచాయతీ సర్పంచ్ నక్కా అరుణకుమారి, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, కార్యదర్శి రుద్రరాజు ఎస్‌ఎస్ సూరపరాజు తదితరులు పాల్గొని ప్రతీ ఇంట మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని అతిథులు ప్రజలను కోరారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

ముమ్మిడివరం, మే 17(ఆంధ్రజ్యోతి): భూతాపాన్ని తగ్గించేందుకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచిస్తూ ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరంలో శనివారం బీట్ ద హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి బళ్ల గేటు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి జ్యూట్ బ్యాగులు వినియోగించాలని, కాలుష్యాన్ని తగ్గించాలని వారు నినాదాలు చేశారు. అనంతరం బళ్లగేటు సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈ టీవీ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ జేఎస్ఎన్ రాజు, సచివాలయ, మెప్మా, నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామాలయం కల్యాణవేదికను తొలగించకండి

- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించిన హిందూ ధార్మిక సంఘాలు
- సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ



ఎమ్మెల్యే గిడ్డికి వినతిపత్రం అందిస్తున్న కృష్ణ ధర్మపరిరక్షణసమితి రాష్ట్ర ముఖ్య అధ్యక్షుడు కేడీఆర్

పి.గన్నవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): వైనతేయ గోదావరి నదీ తీరాన ఉన్న శ్రీపట్టాభి రామస్వామి రామాలయం ఎదుట యాగశాల ఏర్పాటును అడ్డుకోవద్దని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కృష్ణధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర ముఖ్య అధ్యక్షుడు కేడీఆర్ (కె.దుర్గారావు) కోరారు. ఆలయ సేవకురాలు పేరిచర్ల సత్యవాణి, స్థానిక మహిళలతో కలిసి శనివారం ర్యాలీగా వచ్చి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం నుంచి నిధులు సేకరించి కల్యాణవేదిక, యాగశాల శాశ్వత నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ అన్నక్యాంటీన్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వులు అనుసరించి తహశీల్దార్, ఎంపీడీవోలు స్థల పరిశీలన చేశారని, పి.గన్నవరంలో స్థలం లేక ఆ స్థలాన్ని సూచించామని అధికారులు చెప్పారని, అప్పటికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించామని ఎమ్మెల్యే వివరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అధికారులు కానీ, ఆలయానికి సంబంధించిన వారు ఏవిధమైన సమాచారం ఇవ్వలేదని ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వం దృష్టికి మీసమస్యను తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హిందు సంఘాలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.వినతిపత్రం అందించిన వారిలో కృష్ణధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ దాసు రాజు, రామసేతు బృందంలలిత్‌కుమార్, ఎం.పరందామయ్య, పి.సీతారామయ్య, గురుడవేగ టీమ్, రామసేతు టీమ్, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల్లో స్లిప్ విధానం తొలగించాలి

మామిడికుదురు, మే 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ చేపట్టడం అభినందనీయమని తెలుగు రైతు రాజోలు నియోజకవర్గ అధ్యక్షుడు ఈలి శ్రీనివాస్ అన్నారు. ఈప్రక్రియకు సంబంధించి నిబంధనలను సడలించాలన్నారు. వివాహితులైన కుమారులు, కుమార్తెల పేర్లు ముందుగా రేషన్‌కార్డు నుంచి తొలగించిన తరువాతనే వారి అర్హతను బట్టి కొత్త కార్డులు మంజూరు చేయాలని సూచించారు. స్లిప్ విధానం వల్ల ఎన్నో సమస్యలు ఏర్పడుతున్నాయని దాన్ని పూర్తిగా తొలగించాలని కోరారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కంచి విశ్వనాథం, సాపే ఏకాదశి, అప్పారి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి విజయభాస్కరరావు, బందన సూర్యనారాయణ పాల్గొన్నారు.

బాలబాలాజీకి పూజలు



మామిడికుదురు, మే 17(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామున అర్చకులు స్వామివారికి తొలిహారతి ఇచ్చి సుప్రభాత సేవ నిర్వహించారు. శనివారం పురస్కరించుకుని స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కొత్త, పాత ఆలయాలు భక్తుల కోలాహలంతో కిటకిటలాడాయి. శనివారం స్వామివారిని 4500మంది భక్తులు దర్శించుకుని, 2800 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారన్నారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.3,49,454 ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

మహానాడుకు ఎన్టీఆర్ విగ్రహం


ఎన్టీఆర్ విగ్రహాన్ని బహూకరిస్తున్న శిల్పి మాధవరావు

ముమ్మిడివరం, మే 17(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో మే 25, 26, 27 తేదీల్లో నిర్వహించే మహానాడుకు శిల్పి పెద్దిరెడ్డి వెంకటకృష్ణమాధవరావు ఎన్టీఆర్ విగ్రహాన్ని బహూకరించారు. ముమ్మిడివరం మండలం గాడిలంక గ్రామానికి చెందిన శిల్పి పెద్దిరెడ్డి వెంకటకృష్ణమాధవరావు స్వర్గీయ నందమూరి తారకరామారావు బస్ట్ సైజ్ విగ్రహాన్ని రూపొందించి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు బహూకరించారు. ఈవిగ్రహాన్ని మహానాడులో వేదికపై ఉంచనున్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల సాయి, జంపన బాబు, గాడిలంక టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్ పూజలు

మలికిపురం, మే 17(ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం విశ్వేశ్వరాయపురంలోని బలుసులమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు ఆయనకు స్వాగతం పలికారు.

క్లాప్ మిత్రలు లేకుండా చెత్త సంపద కేంద్రాలెందుకు?

ఉప్పలగుప్తం, మే 17(ఆంధ్రజ్యోతి): 'గ్రామంలో వీధులు ఊడ్చేందుకు క్లాప్‌మిత్రలే లేరు.. మీరేమో చెత్త సంపద కేంద్రాలపై ప్రజలకు ఉపన్యాసాలిస్తుంటారు.. చెత్త చేరవేసే మార్గమే లేనప్పుడు సంపద తయారీ ఎక్కడ?' అంటూ శనివారం భీమనపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజలు అధికారులను నిలదీశారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంపై ప్రత్యేక అధికారి ఎస్ఎం షంషే మాట్లాడుతుండగా అక్కడున్న గ్రామస్తులు క్లాప్ మిత్రలు లేరంటూ ఆందోళన చేశారు. ఆకేటి సత్తిబాబు, పంచాయతీ సభ్యుడు ఆకేటి శ్రీనివాసరావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమనపల్లి జనాభా 5వేలుండగాఇద్దరు క్లాప్‌మిత్రలతో కాలక్షేపం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అయిదుగురు క్లాప్ మిత్రలతో పాటు గ్రీన్ అంబాసిడరు ఉంటేనే చెత్త సంపద కేంద్రం నిర్వహణ జరుగుతుందని మీకు తెలియదా? అని అధికారులను నిలదీశారు. కార్యదర్శి పెట్టా నాగేశ్వరరావుతో పాటు అధికారులు మౌనం వహించారు. పంచాయతీ వద్ద కార్యక్రమం ముగించుకుని చెత్త సంపద కేంద్రం వద్ద అధికారులు మొక్కలు నాటారు. చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు గ్రామస్తుల మాటల్లో వాస్తవాన్ని గ్రహించారు. సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ స్వచ్ఛభారత్ ఇన్‌చార్జి, డ్వామా ఏపీడీ రాంబాబు, ఎంపీడీవో పీఆర్పీ రాజ్‌కుమార్, ఏపీవో వీరబాబు, టెక్నికల్ అసిస్టెంట్ బాలరాజు, నాయకులు గొలకోటి తాతాజీ, ఆకేటి బాబులు, ఆకేటి వెంకన్న, ఫీల్డ్‌అసిస్టెంట్ పెయ్యల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఆకేటి సత్తిబాబు ఆధ్వర్యంలో చెత్త సేకరణ లేకుండా చెత్త సంపద కేంద్రాలెందుకని అధికారులను నిలదీస్తున్న దృశ్యం

బీపీని నియంత్రణలో ఉంచుకోవాలి

పి.గన్నవరం, మే 17(ఆంధ్రజ్యోతి): వైద్యుల సలహాతో రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.రాఘవేంద్రరావు తెలిపారు. రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి నిమజ్జన ఊరేగింపు

అన్నప్రసాద వితరణకు భారీగా తరలివచ్చిన భక్తులు


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

అమలాపురంరూరల్, మే17(ఆంధ్రజ్యోతి): బండారులంకలోని బిళ్లవారి వీధిలో వేంచేసి ఉన్న శ్రీపద్మావతి అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీనివాసా బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో శనివారం మహా అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పినిపే శ్రీకాంత్, పార్టీ కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రుద్రరాజు సూరపరాజు, ఎంపీటీసీ అంకం హిమభారతి, ఊటుకూరి సుబ్రహ్మణ్యం, బాసిన శివన్నారాయణ, ఉప్పుగంటి భాస్కరరావు తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అంకం గిరిమహేశ్వరరావు-లత దంపతులు తొలుత పూజాభిషేకాలు నిర్వహించారు. కల్యాణమహోత్సవాల ముగింపులో భాగంగా స్వామివారి కలశ నిమజ్జనాన్ని మంగళవాయిద్యాల నడుమ వైభవంగా జరిగింది. మహిళలు పాల్గొన్నారు. బండారులంక పురవీధుల్లో స్వామివారి నిమజ్జన పల్లకీ ఊరేగింపునకు భక్తులు నీరాజనాలు పలికారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

అమలాపురం టౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో గోల్డ్ మార్కెట్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, కట్టోజు సన్నాయిదాసు, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, బీజేపీ నాయకుడు మోకా వెంకటసుబ్బారావు, హెల్త్‌క్లబ్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, నూకల సత్యనారాయణ, పట్నాల వెంకటరమణ, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, చింతలపూడి సత్తిబాబు, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో విజేతలకు బహుమతులు

అమలాపురం టౌన్, మే 17(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-11 చెస్ పోటీలు శనివారం అమలాపురంలోని విద్యానిధి స్కూలులో ఉత్సాహంగా సాగాయి. జిల్లా నలుమూలల నుంచి 44మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. బాలుర విభాగంలో ఆలమూరు మండలం చొప్పెల్లకు చెందిన పితాని ధ్యానసత్యకార్తీక్ ప్రథమ, అయినవిల్లి మండలం తొత్తరమూడికి చెందిన కొడమంచిలి రిషివర్ధన్ ద్వితీయ స్థానం సాధించాడు. బాలికల విభాగంలో ఎస్.కొత్తపల్లికి చెందిన జాన్‌బ్లెస్సీ ప్రథమ, ఈదరపల్లికి చెందిన అడబాల ప్రావీణ్యశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈనెల24 నుంచి గుంటూరు జిల్లా నర్సారావుపేటలో జరిగే రాష్ట్ర చాంపియన్ షిప్ పోటీలకు హాజరు కానున్నారని అసోసియేషన్ సెక్రటరీ టీవీ సురేష్ తెలిపారు. విద్యానిధి చైర్మన్ ఆకుల బాపన్నాయుడు విజేతలకు బహుమతులు అందజేశారు.

మలికిపురంలో నేడు తిరంగా యాత్ర

మలికిపురం, మే 17(ఆంధ్రజ్యోతి): దేశ భద్రతను కాపాడేందుకు త్రివిధ దళాల సంకల్పానికి, ఆపరేషన్ సిందూర్ అఖండ విజయానికి మనం సైతం మన సాయుధ దళాలకు సమష్టిగా కృతజ్ఞత అభినందనలు తెలియచేయడానికి మలికిపురంలో ఆదివారం తిరంగ యాత్ర ర్యాలీ నిర్వహిస్తున్నట్టు బీజేపీఅధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ తెలిపారు. ర్యాలీలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ పాల్గొంటారన్నారు.

పంచాయతీ కార్యాలయం వద్ద చలివేంద్రం

ఉప్పలగుప్తం, మే 17(ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న విలసవిల్లి పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. సర్పంచ్ సలాది ఊర్మిళాసతీష్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సలాది సతీష్, పంచాయతీ కార్యదర్శి డి.శివప్రసాద్, వీఆర్వో కోటిపల్లి వెంకటరమణ, గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఆధ్వర్యంలోనే కాల్వ పనులు నిర్వహించాలి

పి.గన్నవరం, మే 17 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఆధ్వర్యంలోనే పంటకాల్వల్లో పనులు నిర్వహించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పనులు ప్రతిపాదించే సమయంలో, పనులు నిర్వహించే సమయంలో నీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులకు సమాచారం అందించాలని సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పి.గన్నవరం, అమలాపురం సబ్ డివిజన్ల పరిధిలోని పంటకాల్వల్లో పూడికతీత, తూటు తొలగింపునకు రూ.1.40కోట్లు, డ్రెయిన్లలో తూటుతొలగింపు, పూడికతీత తొలగింపునకు రూ.90లక్షలు, హెడ్ వర్క్స్‌కు సంబంధించి రూ.10లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈపనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గంటిపెదపూడి నుంచి వాడ్రేవుపల్లి వరకు పంటకాల్వ చెంతన ఉన్న ఆక్రమణలు తొలగించాలని సూచించారు. సెంట్రల్‌డివిజన్ ఈఈ బి.శ్రీనివాసరావు, ఇరిగేషన్ డీఈ ఆర్.నాగేంద్రకుమార్, ఏఈలు ఎ.దుర్గానాయుడు, డి.సుందర్‌సింగ్, నవీన్‌కుమార్, పవన్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం

మలికిపురం, మే 17(ఆంధ్రజ్యోతి):మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న ఎనిమిది మందికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు రూ.77వేలను అందించారు. ముత్యాల ఉమామహేశ్వరికి, చొప్పల కళావతికి, యర్రంశెట్టి రామలక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, దేశినీడి అయ్యప్ప, నేదూరి సూర్యనారాయణ, పెదపాటి చిట్టిబాబులకు రూ.10వేలు చొప్పున, శెట్టెం రాకేష్‌కు రూ.7వేలను అందించారు. జంపన బుజ్జిరాజు, బోనం రాజు, అటారం మాష్టారు, అల్లూరి మధురామరాజు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

యానాం, మే 17(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ నేపథ్యంలో పుదుచ్చేరి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పుదుచ్చేరి వ్యాప్తంగా నిర్వహించిన షాపింగ్ ఫెస్టివల్ విజేతలకు బహుమతులు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక సిగల్స్ మేనేజర్ మురళీధరన్ ప్రారంభించారు. పుదుచ్చేరిలోని మొత్తం 30 నియోజకవర్గాల్లో గత డిసెంబరు నుంచి ఈఏడాది ఫిబ్రవరి వరకు వివిధ కొనుగోళ్లపై కూపన్లు అందజేశారు. మార్చి 26న రూ.9కోట్లు విలువైన కూపన్లకు లాటరీ నిర్వహించారు. యానానికి సంబంధించి 1,209మంది విజేతలకు వివిధ గృహోపకరణాలు పంపిణీ చేశారు.

బాలబాలాజీ దేవస్థానంలో తనిఖీలు


అప్పనపల్లి దేవస్థానాన్ని తనిఖీ చేస్తున్న భద్రతా సిబ్బంది

మామిడికుదురు, మే 17(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడులు జరుగుతున్న నేపథ్యంలో శనివారం అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో భద్రతా సిబ్బంది తనిఖీ చేశారు. దేవస్థానమంతా పోలీసు జాగిలాలతో అన్ని ప్రాంతాల్లోను క్షుణ్ణంగా తనిఖీచేశారు. అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే దేవాలయాల్లో రక్షణ వ్యవస్థ ఏవిధంగా పనిచేస్తుందని పరిశీలన చేశారు. భద్రతా సిబ్బంది, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు గొలుసును లాక్కెళ్లిన హిజ్రాలు

పి.గన్నవరం, మే 17(ఆంధ్రజ్యోతి): ఉడిమూడి శివారుచింతావారిపేట వద్ద హిజ్రాలు ఒక వ్యక్తి వద్ద నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఈవిషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గంటిపెదపూడి శివారు బూరుగులంక గ్రామానికి చెందిన అడ్డాల నరసన్న గతనెల 26న ద్విచక్రవాహనంపై పెట్రోలు కోసం బెల్లంపూడి ఎస్ఆర్ బంకు వద్ద వస్తున్నాడు. చింతావారిపేట వద్దకు వచ్చేసరికి రోడ్డు చెంతనే ఉన్న నలుగురు హిజ్రాలు వాహనాన్ని ఆపి అతడి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. అప్పటి నుంచి వారి కోసం గాలించి నప్పటికి ఫలితం లేకపోవడంతో శనివారం అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

యువకుల కుటుంబాలకు ఎంపీ పరామర్శ

అంబాజీపేట, మే 17(ఆంధ్రజ్యోతి): సింహాచలం ఘటనలో పత్తి దుర్గాస్వామినాయుడు, కుంపట్ల ఈశ్వరమణికంఠశేషరావు మృతిచెందగా అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో బాధిత కుటుంబాలను ఎంపీ గంటి హరీష్‌మాధుర్ శనివారం పరామర్శించారు. యువకుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, బొంతు పెదబాబు, గణపతి వీరరాఘవులు, గుడాల ఫణి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, కొర్లపాటి వెంకట్, అరిగెల బలరామమూర్తి, రవణం రాము, షైపాల తాతాజీ, మందా రాజేష్ పాల్గొన్నారు.

దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ పూజలు

అయినవిల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయానికి దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శనివారం విచ్చేశారు. కమిషనర్ కె.రామచంద్రమోహన్ సతీసమేతంగా శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆలయ ప్రధానార్చకులు ఆధ్వర్యంలో వేదాశీర్వచనం అందజేశారు. ఈవో స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

రావులమ్మ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

అంబాజీపేట, మే 17(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం గ్రామదేవత శ్రీరావులమ్మ అమ్మవారి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ కె.చిరంజీవి సూచించారు. స్థానిక ఆలయం వద్ద సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన ఉత్సవ కమిటీతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల23వతేదీ నుంచి నిర్వహించే ఉత్సవాలకు అనుమతి తీసుకోవాలన్నారు. ఉత్సవంలో అశ్లీలనృత్యాలు ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్లెక్సీల ఏర్పాటులో వివాదాలు రాకుండా పెద్దలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో దొంగతనాలు అరికట్టేందుకు సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలన్నారు. నాయకులు ఎం.ఎం.శెట్టి, అడపా బాబ్జి, విత్తనాల శేఖర్, అడపా సత్తికొండ, అల్లాడ రవి, అడపా సత్తికొండ, బంధన రాంబాబు, శింగంశెట్టి పుల్లారావు పాల్గొన్నారు.

కార్యకర్తల గుర్తింపే టీడీపీకి బలం

ఐ.పోలవరం, మే 17(ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వడం ద్వారా క్షేత్ర స్థాయిలో టీడీపీ మరింత బలోపేతమవుతోందని మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద అన్నారు. మండలంలో ఎదుర్లంక, పాతయింజరం నూతన గ్రామ కమిటీల ఎన్నిక శనివారం జరిగింది. కార్యక్రమానికి వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై ఎన్నికైన గ్రామ కమిటీలను అభినందించారు. ఎదురులంక టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సాగిరాజు వాసురాజు, పాతయింజరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పేరాబత్తుల వెంకటరమణ ఎన్నికయ్యారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదేశాలతో నూతన కమిటీల ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో సాగిరాజు సూరిబాబురాజు, దాట్ల వర్మ, ముదునూరి వాసురాజు పాల్గొన్నారు.

లక్ష్మీఅన్వితకు అవార్డు


మైసూర్‌లో గణపతి సచ్చిదానందస్వామి నుంచి అవార్డు అందుకున్న లక్ష్మీఅన్విత

అంతర్వేది, మే 17(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలేనికి చెందిన లక్ష్మీఅన్విత నాల్గో తరగతి చదువుతూ మైసూర్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ భగవద్గీత పోటీల్లో అవధూత దత్త పీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానందస్వామిజీ అనుగ్రహంతో ఉత్తమశ్రేణి డిస్టెంక్షన్‌లో ఉత్తీర్ణత సాధించింది. గణపతి సచ్చిదానందస్వామి నుంచి బంగారుపతకం, అవార్డును అందుకుంది. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, గ్రామస్తులు చిన్నారి అన్వితకు అభినందనలు తెలిపారు.

గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అజిత్‌వర్మ



కాట్రేనికోన, మే 17(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన పంచాయతీ గచ్చకాయలపొరకు చెందిన మల్లాడి మహావిష్ణుభైరవ తనయుడు అజిత్‌వర్మ న్యూయార్క్ సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పట్టా సాధించాడు. మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఐటీ మేనేజ్‌మెంట్ చదివాడు. ఇతర దేశాల్లో ఉంటూ ఉన్నత ప్రతిభను కనబరిచిన అజిత్‌వర్మను పలువురు అభినందించారు.

నేడు టీడీపీ మినీ మహానాడు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 17(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో నేడు టీడీపీ మినీమహానాడు నిర్వహిస్తున్నట్టు మంత్రి సుభాష్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఇది జరుగుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని మంత్రి కోరారు.

అడ్డాలపాలెంలో మట్టి అక్రమ తరలింపు

అంతర్వేది, మే 17(ఆంధ్రజ్యోతి): అడ్డాలపాలెం, చొప్పలవారిపేటలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వం ఎన్ని హెచ్చరికలు చేసినా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా ఇష్టానుసార ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.



వెదురుమూడిలో సాంస్కృతిక నృత్యాలతో జాతర నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా కుంతీదేవి జాతర

కపిలేశ్వరపురం, మే 17 (ఆంధ్రజ్యోతి) : వెదురుమూడిలో కుంతీదేవి జాతరను శనివారం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి రెండు రోజులపాటు జరిపే ఈ జాతరలో గారడీ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషాలు, బాణసంచా మధ్య ఘనంగా జరిగింది. పదహారు ఏళ్ల అనంతరం నిర్వహిస్తున్న జాతర కావడంతో సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సైతం జాతరలో పాలుపంచుకున్నారు. గ్రామస్థులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

మందపల్లి స్వామివారి ఆదాయం రూ.1.62 లక్షలు

కొత్తపేట, మే 17(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు భక్తజనం బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తజనం ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ. 1,62,878 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రేపటి నుంచి ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 17 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధనకు మున్సిపల్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది సోమవారం నుంచి విధులు బహిష్కరిస్తున్నట్టు ఔట్ సోర్సింగ్ సిబ్బంది తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వారు తెలిపారు. జీతాలు పెంపుదల, సెలవుల మంజూరు, ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు తదితర డిమాండ్ల సాధనకు రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. వేతనాలు చాలక ఆర్థిక సమస్యలతో గడుపుతున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గుత్తుల సత్యశ్రీనివాస్, మట్టపర్తి నాగార్జున, వడ్డ శ్రీనివాస్, గుబ్బల ప్రసాద్, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన

మండపేట, మే 17(ఆంధ్ర జ్యోతి): మండలం లోని 12 పంచాయతీల్లో బీట్ ద హీట్ కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం ఎంపీడీవో సత్యనారా యణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనివాస్‌ల సారథ్యంలో కార్యక్రమాలు జరిగాయి. మండ లంలోని అన్ని పంచాయ తీల్లో వీటిని నిర్వహించారు. గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాలీలను నిర్వహించారు. బీట్ ద హీట్ కార్యక్రమంలో భాగంగా పశువులకు మంచినీళ్ల తొట్టెలను ఏర్పాటు చేయడంతోపాటు పక్షులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ద్వారపూడి గ్రామంలో వున్న బస్‌షెల్టర్ వద్ద గ్రీన్‌క్లాత్ ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రయాణికులకు ఎండ తీవ్రత తగలకుండా పంచాయతీ కార్యదర్శి ఆకుల వీ.వీ.రమణ సారథ్యంలో క్లాత్‌ను ఏర్పాటు చేశారు. వేములపల్లి పశువుల సంత షెడ్డు వద్ద పశువులకు ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకు తొట్టెను ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు. తడిపొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు. పక్క చిత్రంలో బారులుతీరిన భక్తజనం

కిక్కిరిసిన వాడపల్లి వెంకన్న ఆలయం

ఆత్రేయపురం, మే 17(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించిన అనంతరం అన్న ప్రసాదంలో పాల్గొ న్నారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పగలు ఎండ, సాయంత్రం చిరుజల్లుల మధ్య భక్తజనం నోము ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.54.35 లక్షలు లభించినట్టు ఉపకమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

విజ్ఞాన సర్వస్వం పుస్తకావిష్కరణ

మండపేట, మే 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస వేదిక ఆధ్వర్యంలో ప్రచురించిన గ్రంథాలయ పునర్వికాస పుస్తకాన్ని మండపేట శాఖ గ్రంథాలయంలో శనివారం అవిష్కరించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా గ్రంథాలయ పునర్వికాస వేదిక కన్వీనర్ మాతా చినబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పుస్తక తొలి ప్రతిని గ్రంథాలయ అధికారిణి పూర్ణమ్మకు అందజేశారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు గండి స్వామిప్రసాద్, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



అంగరలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

ఎండ తీవ్రతపై గ్రామీణ వికాస్ శ్రామికులకు అవగాహన

కపిలేశ్వరపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ కార్యాలయాల్లో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఎండ తీవ్రతపై గ్రామీణ వికాస్ శ్రామికులకు అవగాహన కల్పించారు. అంగర గాంధీ సెంటర్‌లో స్వచ్ఛత పై ప్రతిజ్ఞ చేశారు. కపిలేశ్వరపురం, అంగర గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్‌టీవీ రాజేశ్వరరావు, ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అధిక ఎండల నేపథ్యంలో వడగాడ్పులకు గురవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఎంపీడీవో ఆర్‌ఎంవివిఎన్ ఈశ్వరరావు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ద్రాక్షారామలో స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞలో పాల్గొన్న మంత్రి సుభాష్



అలమూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు



ఆత్రేయపురంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో రామన్

పారిశుధ్యం మెరుగుతో ఆరోగ్యకర సమాజం

• స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో మంత్రి సుభాష్ • పలుచోట్ల అధికారులు, ప్రజలు ప్రతిజ్ఞ

రామచంద్రపురం/ద్రాక్షారామ, మే 17(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పారిశుధ్యం మెరుగుతో ఆరోగ్యకర సమాజం సాధ్యమవుతుందని మంత్రి సుభాష్ అన్నారు. శనివారం రామచంద్రపురం పట్టణం, ద్రాక్షారామలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. రామచంద్రపురం పురపాలక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి రాజగోపాల్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీని మంత్రి సుభాష్ ప్రారంభించారు. పురపాలక సంఘం కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ద్రాక్షారామలో జరిగిన స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ ప్రతిజ్ఞలో మంత్రి పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయంలో మొక్కలు నాటారు. మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులను సత్కరించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. రామచంద్రపురంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని ప్రజలు దీన్ని వినియోగించుకోవాలన్నారు. పక్షులు, వీధి జంతువులకు మానవతా దృక్పథంతో నీరందించేలా ప్రజలు ఏర్పాట్లు చేయాలని మంత్రి కోరారు. కార్యక్రమాల్లో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీకాంత్, మున్సిపల్ ఉద్యోగులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ద్రాక్షారామలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఎంపీడీవో పద్మజ్యోతి, ఈవో పీఆర్‌డీ షెలత్‌రాజు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రకు కృషి చేద్దాం

అలమూరు, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలని పలువురు వక్తలన్నారు. అలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శనివారం జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలలో భాగంగా అధికారులు, నాయకుల సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో ఎ.రాజు వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజు, తహశీల్దార్ ప్రకాష్‌బాబు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్రకు కలసికట్టుగా పనిచేస్తే లక్ష్యాలను చేరుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో మోహర్‌ప్రకాష్, ఏపీవో అరుణకుమారి, ఏపీఎం ధనరాజు, హౌసింగ్ ఏఈ డి.శ్రీనివాస్, నాయకులు సలాది నాగేశ్వరరావు, వంటిపల్లి సతీష్‌కుమార్, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం: ఆలమూరులో శనివారం పలు ప్రాంతాల్లో వేసవి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. మండల పరిషత్ కార్యాలయం, అలమూరు బస్టాండు, వినాయక గుడి సెంటర్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజుతోపాటు పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో బీట్ ది హీట్ అనే థీమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేకాధికారి ఎన్వీ రామారావు, ఎంపీడీవో వెంకటరామన్, సర్పంచ్ గెడ్డం సుధ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు బీట్ ది హీట్‌లో భాగంగా వడదెబ్బ నుంచి తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏపీవో విజయా రెడ్డి, ఏపీఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలంలోని ఆయా గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఇందు లో భాగంగా ఆయా గ్రామాల్లో చలి వేంద్రాల ఏర్పాటు, మొక్కలు నాటడం ఇంకుడు గుంతలు, నీటి తొట్టెల ఏర్పాటు తదితర కార్యక్రమాలు చేపట్టి స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో మహేష్, డిప్యూటీ ఎంపీడీవో జి.కృష్ణ పర్యవేక్షణలో గ్రామాల్లో కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, మెడికల్ సిబ్బంది పాలకవర్గ సభ్యులతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కొత్తపేట సర్పంచ్ బూసి జయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కొత్తపేటలోని పలు వీధుల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీని నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, బూసి భాస్కరరావు, కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ద్రాక్షారామలో రథం రహదారిని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్, తదితరులు

రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం

మంత్రి సుభాష్

ద్రాక్షారామ, మే 17,(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, పట్టణాల్లో రహదారుల నిర్మాణం చేపట్టి రూపురేఖలు మారుస్తున్నామని మంత్రి సుభాష్ అన్నారు. శనివారం ద్రాక్షారామలో నిర్మించిన పలు సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి ఆయన ప్రారంభోత్సవం చేశారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రోడ్లన్నీ గుంతలమయంగా తయారయ్యాయని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే అభివృద్ధి జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు తదితర అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఎంపీటీసీ నున్న సత్యవతి ఎంపీడీవో పద్మజ్యోతి, పీఆర్‌ఏఈ యేసురత్నం, టీడీపీ నాయకులు పి.సాంబశివరావు, టేకుమూడి సత్యనారాయణ, పలివెల నాగరాజు, జనసేన నాయకులు నామా వెంకన్నబాబు, సంపతి సత్యనారాయణ, చోటిశెట్టి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికులు వేసవి జాగ్రత్తలు పాటించాలి

ఆలమూరు, మే 17(ఆంధ్రజ్యోతి): వేసవిలో జరిగే జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో పనిచేసే ఉపాధి శ్రామికులు వేసవి జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో ఎ.రాజు సూచించారు. ఆలమూరులో శనివారం చెరువు తవ్వకాలను పరిశీలించి అనంతరం వారితో సమీక్షించారు. వేసవి వేడిగాలులకు జాగ్రత్తలు పాటించడంతోపాటు రక్షణ చర్యలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఈదల సత్తిబాబు, రామానుజుల శేషగిరిరాజు, ఈదల నల్లబాబు, అత్తిలి సత్తిబాబు, చల్లా బాబీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్ 2 పంచాయతీగా గుర్తించండి

ద్రాక్షారామ, మే 17(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాద పంచాయతీని గ్రేడ్ 2 పంచాయతీగా గుర్తించాలని సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు మంత్రి సుభాష్‌ను కోరారు. శనివారం మంత్రికి వినతిపత్రం అందచేశారు. హసన్‌బాద పంచాయతీ ప్రస్తుత జనాభా 2వేలు దాటిందని గ్రేడ్ 2 పంచాయతీగా గుర్తింపునకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



పొగడట్లపల్లి వద్ద గుర్రపుడెక్కతో పూడుకుపోయిన మురుగు డ్రెయిన్. పక్క చిత్రంలో ముమ్మిడివరప్పాడు వద్ద తుప్పలతో పూడుకుపోయిన మురుగు డ్రెయిన్

ఆధునికీకరణకు నోచుకోని మురుగు డ్రైన్లు

• అసంతృప్తి వ్యక్తం చేస్తున్న రైతులు • సమస్య పరిష్కరించాలని ప్రభుత్వ యంత్రాంగానికి వినతి

రావులపాలెం, మే 17(ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లోని మురుగునీరు పారే ప్రధాన మురుగు డ్రెయిన్లు ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో మురుగు పారేదెలా అని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. ఖరీఫ్ నారుమడులు ప్రారంభం సమయం నుంచి నారుమడులు ముంపు బారిన పడకుండా ఉప్పునీరు ప్రధాన మురుగు డ్రెయిన్ల ద్వారా వెళ్లాల్సి ఉంది. రావులపాలెం మండల పరిధిలోని లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, ఈతకోట, గోపాలపురం, ముమ్మిడివరప్పాడుతో పాటు ఇతర గ్రామాల వెంబడి పంట పొలాల్లో మురుగునీరు ప్రధాన మురుగు డ్రెయిన్ల గుండా వెళ్లాల్సి ఉంది. గత వైసీపీ పాలనలో మురుగు డ్రెయిన్ల ఆధునికీకరణ చేపట్టకపోవడంతో తూడు, గుర్రపుడెక్కతో పూడుకుపోయాయి. ప్రస్తుత వేసవిలో కూడా డ్రెయిన్ల ఆధునికీకరణపై అధికారులు దృష్టిసారించకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. వర్షాలు కురిసిన సమయంలో పంటపొలాలు ముంపు బారిన పడకుండా ఇతర చిన్న మురుగు డ్రెయిన్ల మీదుగా ప్రధాన డ్రెయిన్లలోకి రైతులు మళ్లిస్తారు. అవన్నీ పూడుకుపోవడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో మురుగు డ్రెయిన్ల గట్లు జారీపోవడంతో ఆ ప్రాంతంలో మేటలు వేశాయి. దీంతో మురుగునీరు పారే అంశం ప్రశ్నార్థకంగా మారింది. వెంటనే మురుగు డ్రెయిన్లకు ఆధునీకరణకు చేపట్టకపోతే రాబోయే ఖరీఫ్ సీజన్‌లో పంటపొలాలు ముంపుబారినపడి పంటలు నష్టపోయే అవకాశం ఉందంటూ పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు.



లొల్లలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

రాయవరం, మే 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. లొల్ల గ్రామంలో పలు అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబడిపోయిందన్నారు. విజన్ గల నాయకుడు రాష్ట్రానికి అవసరమని గుర్తించి ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఘన విజయాన్ని అందించారని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అనేక ఆర్థిక ఇబ్బందులున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. ఈసందర్భంగా గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లను, జలమీషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కార్యక్రమాన్ని, రూ. 8 లక్షలతో ఆధునికీకరించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చాట్రాతి జానకి, రామచంద్రపురం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ వైట్ల సతీష్, పారిశ్రామికవేత్త కంటిపూడి సర్వారాయుడు, ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన, తహశీల్దారు ఐపీ శెట్టి, కంటిపూడి కృష్ణ, జాస్తి విజయలక్ష్మి, సుంకవిల్లి గంగరాజు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ జయలక్ష్మి

చలివేంద్రం ప్రారంభం

కొత్తపేట, మే 17(ఆంధ్రజ్యోతి): కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సర్పంచ్ బూసి జయలక్ష్మి ప్రారంభించారు. వేసవి తీవ్రత దృష్ట్యా పంచాయతీ ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, కాశీ ధనరాజు, బూసి భాస్కరరావు, కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొలుసు చోరీ

ద్రాక్షారామ, మే 17(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండలం కుందూరు గ్రామానికి చెందిన మేడిశెట్టి రేఖ తన అత్తతో శుక్రవారం స్కూటీపై ద్రాక్షారామలో షాపింగ్‌కు వచ్చారు. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్తుండగా దాసరిపాడు ఆంజనేయస్వామి గుడి వద్ద వెనుక నుంచి మోటార్ సైకిల్‌పై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి రేఖ మెడలోని 39 గ్రాములన్న బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ద్రాక్షారామ ఎస్ఐ ఎ.లక్ష్మణ్ తెలిపారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

రాయవరం, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడిలో సీఐటీయూ, యూటీఎఫ్, ఐద్వా ఆధ్వర్యంలో జరుగుతున్న విద్యార్థుల వేసవి శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. సీఐటీయూ మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు ఆటలు, పాటలు, వినోదం, కథలు, నైతిక విలువలు, చిత్రలేఖనం తదితర పలు అంశాలపై ఐదు రోజులపాటు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి శిక్షణలు ఉపకరిస్తాయన్నారు. ఉపాధ్యాయుడు ఎం. సాయికృష్ణ పాల్గొని విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఐదురోజుల శిక్షణలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సీతాదేవి, కె.వెంకటరమణ, కడలి శ్రీనివాస్, మురళీకృష్ణ, నల్లమిల్లి భాస్కరరెడ్డి, కిలపర్తి శ్రీనివాస్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పసలపూడిలో విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్న దృశ్యం